

రెవెన్యూ అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డు

- ఎర్రగొండపాలెంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల స్వాధీనంపై అధికారుల ఉదాసీనత
- వైసీపీ హయాంలో విచ్చలవిడిగా కబ్జాలు, వాటిల్లో నిర్మాణాలు
- ప్రస్తుతం ఫిర్యాదులు వెళ్లిన ప్రతిసారీ హెచ్చరిక బోర్డులు పెట్టడం వరకే పరిమితం
- ఆ తర్వాత రెండురోజులకే అవి మాయం
- బాలికల హాస్టల్‌కు నిధులున్నా స్థలం లేక నిర్మాణంలో జాప్యం
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న పలు ప్రభుత్వ కార్యాలయాలు

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కీలక మండల కేంద్రాలలో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాలు అందుబాటులో లేవు. ఉన్న భూములు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఎర్రగొండపాలెంలో భూములను గుర్తించి అవసరమైన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఉపయోగించాల్సిన అధికారులు, సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు వత్తాసు పలుకుతున్నరు. ఆ స్థలాలను ఆక్రమణదారుల ఆధీనంలో ఉండేలా పరోక్షంగా సహకరిస్తున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టిసారించినా అంతా బాగుందని నివేదికలు ఇచ్చి మాయచేస్తున్నారు.



అంతా భూ'ఆటకం'.. బోర్డులతో నాటకం..!

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు రహదారిలోని సర్వే నెంబరు 28, 28-1లో అప్పటి వైసీపీ హయాంలో సుమారు పది ఎకరాల భూమిని ఆక్రమించి అందులో కొంత స్థలంలో భవనాలు నిర్మించగా, మిగిలిన దానిలో వెంచర్లు వేశారు.ఈ కబ్జాలపై అప్పటినుంచి నేటి వరకు ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతంలో ప్రభుత్వ భూమి అని బోర్డులను ఏర్పాటు చేస్తారు. అంతే అవి రెండు రోజులకే మాయం అవుతాయి. మళ్లీ ఆక్రమణలు మామూలే. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎర్రగొండపాలెనికి చెందిన లక్ష్మీనారాయణ, సాలమ్మ కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అన్సారియా స్పందించి ఆ భూములను పరిశీలించాలని పూర్తి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్, ఒడా అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 9న ఆ ప్రాంతాన్ని డిప్యూటీ కలెక్టర్, ఒడా అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ భూమికి కొలతలు వేసి, నివేదిక ఇవ్వాలని సర్వేయర్‌ను ఆదేశించారు. అయినప్పటికీ సర్వేయర్ ఆ భూమికి కొలతలు వేసి, నివేదిక ఇచ్చిన దాఖలాలు కన్పించలేదు. వీటితో పాటు కొలుకుల గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో సర్వే నెంబరు 600లో సుమారు కోటి రూపాయల విలువ చేసే 37 సెంట్ల భూమి, మిల్లంపల్లి దేవాలయానికి వేళ్లే దారిలో సర్వే నెంబరు 587-2లో వాగుపోరంబోకు 70 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైతే కేవలం ప్రభుత్వ భూమి అని బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. వాటి సంరక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూ సర్వే చేసేందుకు నూతన టెక్నాలజీ మిషన్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ ఎర్రగొండపాలెంలో ప్రభుత్వ భూములు సర్వే చేసి వాటిని స్వాధీనం చేసుకోవడంలో అధికారులు తీవ్రజాప్యం ప్రదర్శిస్తుండడం గమనార్హం.

ఎర్రగొండపాలెం మండల కేంద్రానికి నలుమూలల నుంచి చదువుకునేందుకు వచ్చే విద్యార్థినుల కోసం హాస్టల్ నిర్మాంచాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా రూ.6కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం లేకపోవడంతో నిర్మాణ పనుల్లో ఆలస్యం అవుతోంది. ఇదిలా ఉంటే అనేక ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దెభవనాల్లోనే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నా ప్రైవేటు భవనాలకు అద్దెలు చెల్లించి నిర్వహిస్తుండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ భూముల ఆక్రమణ, కబ్జాల పర్వం యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6కోట్లు వచ్చినా స్థలం లేక నిర్మించని బాలికల హాస్టల్


రాళ్లవాగు పక్కనే ఉన్న ఆక్రమిత భూమి ఇదే.. దీనిపై ఫిర్యాదులు అందినా సర్వే చేసి పూర్తి నివేదిక ఇవ్వని సర్వేయర్లు, అధికారులు

సర్వేయర్‌దే కీలక పాత్ర

గతంలో కొన్ని నెలలు ఇన్‌చార్జి మండల సర్వేయర్‌గా, ప్రస్తుతం సచివాలయం సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఈ ఆక్రమిత భూముల విషయంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేసినా, తహసీల్దార్ ఆదేశించినా సర్వేయర్ అలాంటిదేమీ లేదని నివేదికలను ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం.రీసర్వే గ్రామాల్లో కూడా కొందరు సర్వేయర్లు రైతుల నుంచి భారీగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం
మంజునాథరెడ్డి, తహసీల్దార్

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తనకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తెసుకెళ్లాం. జిల్లా సర్వేయర్ స్థాయిలో కొలతలు వేయించే ఆలోచన చేస్తున్నాం. పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖ అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించి రక్షణ చర్యలు చేపడతాం.

ఉత్సాహంగా..

- 'సుపరిపాలనలో ఏడాది' కార్యక్రమం
- ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న టీడీపీ శ్రేణులు
- పలుచోట్ల ముఖ్యనేతలు హాజరు
- గిద్దలూరులో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ముత్తుముల


గిద్దలూరు మున్సిపాలిటీలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ముత్తుముల

ఒంగోలు జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనకు ఏడాది' పేరుతో జిల్లాలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన కార్యక్రమం నాల్గవ రోజైన శనివారం కూడా ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనాయకులు తమ పరిధిలో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పలుచోట్ల స్థానిక నేతలు ఎక్కడికక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏడాది కాలంలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పనుల పరిశీలనతోపాటు కొన్నిచోట్ల సమస్యలను పరిశీలిస్తున్నారు. గిద్దలూరు పట్టణంలోని 16వ వార్డులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి సుపరిపాలనకు ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఆ వార్డులో రూ.39 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని 29వవార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలను కలుస్తున్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వెలిగండ్లలోని దళితవాడలో కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 50వ డివిజన్‌లో, అలాగే రెండో డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ చీమకుర్తి మండలం చంద్రపాడులో, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు దోర్నాలలో, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు దర్శి మండలం కొత్తపల్లిలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యవసాయ కార్పొరేటీకరణను అడ్డుకునేందుకు
ఐక్య ఉద్యమాలే శరణ్యం 7
ఒంగోలులో ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు అమ్రారామ్

కొత్త పోస్టింగులు సిద్ధం

- రేపు సచివాలయాల్లో చేరనున్న ఉద్యోగులు
- బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మార్పులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సోమవారం కొత్త పోస్టింగ్‌ల్లో చేరనున్నారు. వారి బదిలీల ప్రక్రియ గత నెల 30న ముగిసింది. ఆ మరుసటి రోజు ఉద్యోగులు కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంది. ఒకటో తేదీన సామాజిక పింఛన్ల పంపిణీతోపాటు తల్లికి వందనం పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయాల్సి ఉండటంతో అందుకు కోసం ఐదు రోజులు గడువు ఇచ్చింది. ఈనెల 5న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించడంతో తదనుగుణంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో గ్రామ సచివాలయాలు 597 ఉండగా వాటిలో 5,566 మంది, వార్డు సచివాలయాలు 122 ఉండగా 1,056 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు వారి సొంత మండలాల్లోనే పనిచేసే విధంగా నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బదిలీలకు పలు మార్గదర్శకాలను జారీచేసింది. సొంత మండలాల్లో కాకుండా ఇతర మండలాలకు బదిలీ చేయడంతోపాటు ఐదేళ్లు ఒకేచోట ఉన్న ఉద్యోగులందరిని బదిలీ చేయాలని ఆదేశించింది. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత వార్డు, డివిజన్ కాకుండా ఇతర డివిజన్లు, వార్డులకు బదిలీ చేయాలని ఆదేశించడంతో తదనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

అందరూ మారాల్సిన పరిస్థితి

ప్రధానంగా గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 90శాతం మంది బదిలీలు కావాల్సి ఉంది. ఐదేళ్ల సర్వీసు పూర్తికావడంతోపాటు 90శాతం మందికిపైగా వారి సొంత మండలాల్లో పనిచేస్తున్నారు. ఇప్పుడు వారందరినీ ఇతర మండలాలకు బదిలీలు చేశారు.శనివారం పలు శాఖల అధికారులు.. ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులను ఈమెయిల్ ద్వారా ఆయా మండలాలకు పంపారు. ఆయా మండలాల్లో సంబంధిత అధికారులను కలిసి బదిలీల ఉత్తర్వులు తీసుకొని అక్కడ విధుల్లో చేరాలని జిల్లా ఉన్నతాధికారి ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయ ఉద్యోగులందరూ సోమవారం వారు బదిలీ అయిన సచివాలయాల్లో విధుల్లో చేరాల్సి ఉంది. ఇప్పటికే ఏ ఉద్యోగి ఏ మండలం, ఏ గ్రామానికి బదిలీ అయింది పూర్తిస్థాయి సమాచారం ఉద్యోగుల వద్ద ఉంది. ప్రభుత్వ ఆదేశించిన విధంగా శనివారం నుంచే బదిలీల ఉత్తర్వులు జారీకావడంతో సాయంత్రమే కొంత మంది రిలీవ్ అయినట్లు తెలుస్తోంది. వారందరూ సోమవారం నియమించిన సచివాలయాల్లో విధుల్లో చేరనున్నారు.



ఎర్రగొండపాలెం మండలం గంజివారిపల్లి పాఠశాల

రెగ్యులర్ టీచర్లు లేని పాఠశాలల జాబితా...

- ఎర్రగొండపాలెంమండలంలో బట్టువారిపల్లి, అమానిగుడిపాడు, వాదంపల్లి (ఎస్సీ), సర్వాయపాలెం, గంగపాలెం, పందివానిపల్లి, చెర్లోతాండా, రేగులపల్లి, గడ్డమీదపల్లి, చిన్నకొలుకుల, గంజివారిపల్లి మెయిన్(ఎస్సీ) మొత్తం 12 పాఠశాలలు
- పుల్లలచెరువు మండలంలో మర్రివేముల ఎస్సీ, గాజులపాలెం, ఎం.ఎర్రబాలెం, గంగవరం ఎస్సీ, పుల్లలచెరువు తాండా, సుద్దకురవతాండా, పిచ్చిరాజుచెరువు తాండా, పాతచెరువుతాండా, నరజాములతాండా, రంగన్నపాలెం, పిడికిటివానిపల్లి, నాయుడుపాలెం మెయిన్, కొత్తూరు, బీరినేనిపల్లి, చౌటపాచర్ల(ఎస్సీ), రెంటపల్లి, రెంటపల్లితాండా, లెనిన్‌నగర్ మొత్తం 19 పాఠశాలలు
- త్రిపురాంతకం మండలంలో బొంకురివారిపాలెం, మిరియంపల్లి, కేశినేనిపల్లి, దూపాడు ఎస్సీ, పాత అన్నసముద్రం మొత్తం 5 పాఠశాలలు
- దోర్నాల మండలంలో కొత్తూరు, చిలకచర్లగూడెం, గంటవానిపల్లి ఎస్సీ తిమ్మాపురంలో రెండు, చింతల అగ్రహారం ఎస్సీ, చిన్నదోర్నాల ఎస్సీ, చిన్నగుడిపాడు, జమ్మిదోర్నాల మొత్తం 10 పాఠశాలలు
- పెద్దారవీడు మండలంలో సానికవరం, మద్దలకట్ట, కలనూతల, తంగిరాలపల్లి, బద్వీడు పాఠశాలున్నాయి.

సర్దుబాటుతో మొక్కుబడిగా..!

'ఎర్రగొండపాలెం'లో ఒక్క టీచర్ కూడా లేని 55 పాఠశాలలు

- ఆ స్కూళ్ల నుంచి అందరూ బదిలీ
- ప్రస్తుతం తాత్కాలిక ఉపాధ్యాయులతో నిర్వహణ
- లేకుంటే 55 స్కూళ్లు మూతే

త్రిపురాంతకం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత అధికమైంది. 55 పాఠశాలల నుంచి ఒక్కరూ లేకుండా అందరూ బదిలీపై వెళ్లిపోయారు. అంటే ఇప్పుడు ఆ స్కూళ్లకు అధికారికంగా టీచర్లు లేరు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు అధికారుల సూచన మేరకు ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయులు, బదిలీపై వెళ్లిన వారిలో 50శాతం వెనక్కి రప్పించి వారి ద్వారా సర్దుబాటు చేసి ప్రతి పాఠశాలకు ఒకరిని నియమించారు. ఐదు మండలాల్లో బదిలీల కారణంగా ఇప్పటికే 486 పోస్టులు ఖాళీ అయ్యాయి. పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లోనే 288 మంది టీచర్లు లేరు.

ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకుండా వెళ్లిన పాఠశాలలను పరిశీలిస్తే కొందరు బదిలీలపై వెళ్లగా, కొన్నిచోట్ల ఉద్యోగవిరమణ ద్వారా ఖాళీ అయ్యాయి. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేనట్లు భావించకూడదని విద్యాశాఖ అధికారులు చెప్తున్నప్పటికీ సర్దుబాటుతో సాగుతున్నాయి తప్ప లేకుంటే అవి మూతపడేవేనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు వెళ్లిపోయిన పాఠశాలల జాబితా చాంతాడంత ఉన్నాయి. బదిలీలపై వెళ్లిన పాఠశాలలకు టీచర్ల సర్దుబాటు ద్వారా స్కూళ్లు మూతపడకుండా అధికారులు నడిపిస్తున్నారు. ఇప్పుడు ఉన్న మొత్తం ఖాళీలతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయులు లేకుండా పోయారు. మరి పదో తరగతి విద్యార్థులకు పాఠాలు ఎలా చెబుతారో అధికారులకే తెలియడం లేదు. ఉదాహరణకు పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు ఉంటారు. ఇక్కడ 24 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఇప్పుడు ప్రధానోపాధ్యాయుడితో కలిపి కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించే ఆలోచన చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతీకార హత్య


వెంకటేశ్వర్లు(ఫైల్)

- మూడేళ్ల క్రితం జరిగిన ఘటనలో హతుడే ప్రధాన నిందితుడు
- అప్పట్నుంచి కుటుంబంతో సహా ఊరు విడిచి వెళ్లిన వైనం
- తాజాగా స్వగ్రామానికి రావడంతో హతమార్చిన ప్రత్యర్థులు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో కత్తులతో దాడి చేసి ప్రతీకార హత్య చేసిన దుర్ఘటన మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన బైరబోయిన వెంకటేశ్వర్లు(38) మృతి చెందారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... గ్రామ సర్పంచి నాగలక్ష్మి భర్త మెద్దు వెంకటేశ్వర్లను మూడేళ్ల కిందట 2022 ఫిబ్రవరి 9వ తేదీన దారి కాచి హత మార్చాడు. ఆ కేసులో గ్రామానికి చెందిన బైరబోయిన వెంకటేశ్వర్లు ప్రథమ నిందితుడిగా ఉన్నారు. అప్పటి నుంచి గ్రామం విడిచి పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంట్యాల గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని భార్యా పిల్లలతో అక్కడే ఉంటున్నాడు. గ్రామంలో మొహర్రం నిర్వహిస్తున్న క్రమంలో వెంకటేశ్వర్లు శుక్రవారం గ్రామానికి వచ్చాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పీర్ల ఉత్సవంలో పాల్గొన్న వెంకటేశ్వర్లుపై కొందరు ఉన్నపళంగా కత్తులతో దాడి చేసి గొంతుపై విచక్షణారహితంగా నరికి చంపారు. అనంతరం ప్రత్యర్థులందరూ పరాయ్యారు. ఈ విషయమై గ్రామస్థులు దోర్నాల పోలీసుస్టేషనుకు సమాచారం అందించారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మహేష్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంకటేశ్వర్లు భార్య విజయలక్ష్మికి విషయం చెప్పడంతో ఆమె గ్రామానికి చేరుకుంది. మృతికి గల కారణాలపై ఆరా తీయగా గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి మరిది మెద్దు తిరుపతిరావు వర్గీయులే చంపారని హతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వర్లకు కుమారుడు ప్రవీణ్, కుమార్తె ప్రణీత ఉన్నారు. హత్యతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.

పండుగ వాతావరణంలో మెగా పీటీఎం

ఒంగోలు విద్య, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం)ను ఈనెల 10న పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కే.ఆంజనేయులు, ఆర్‌ఐవో సైమన్ విక్టర్‌లు కోరారు. స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలో శనివారం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పీటీఎం సమావేశాలను స్ఫూర్తిదాయకంగా, విద్యార్థుల భవితకు మార్గదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి ప్రోత్సాహిక దాతలను, ఉన్నత స్థాయిలో స్థిరపడిన కళాశాలల పూర్వ విద్యార్థులను ఆహ్వానించి కళాశాలల అభ్యున్నతికి, విద్యార్థుల శ్రేయస్సుకు వారు తోడ్పాటును ఇచ్చేలా చూడాలని కోరారు. ప్రతిభావంతులైన పూర్వ విద్యార్థులను ప్రస్తుత విద్యార్థులు ఆదర్శంగా తీసుకునేలా వారితో ఉపన్యాసాలు ఇప్పించాలని కోరారు.

నేడే 'తొలి' పండుగ !

తొలి ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం

పెరిగిన పూలు, పండ్ల ధరలు

కొనుగోలుదారులతో కిక్కిరిసిన వ్యాపార కూడళ్లు

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలకు ఏర్పాట్లు

ఒంగోలు కల్చరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరంలో వచ్చే తొలి పండుగగా పేర్కొనే తొలి ఏకాదశిని ప్రజలు ఆదివారం జరుపుకోనున్నారు. ఆషాఢ మాసం శుక్ల పక్ష ఏకాదశిని తొలి ఏకాదశిగా పేర్కొంటూ ఇప్పటినుంచే సంవత్సరంలో అనేక పండుగలకు శ్రీకారం చుడతారు. దీంతో తొలి ఏకాదశిని తొలి పండుగగా పెద్దలు చెబుతారు. అటువంటి తొలి ఏకాదశిని జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. మరోవైపు దీనిని పేలాల పండుగ అని కూడా పిలుస్తారు. తొలి ఏకాదశి రోజున పేలపిండిని తయారుచేసి విష్ణుమూర్తికి నివేదన చేసి ప్రజలు తింటారు. ఇక పట్టణాలు, నగరాలలో దీని తయారీ కుదరనందున అనేక మంది మార్కెట్‌లో రెడీమేడ్‌గా లభించే పేలపిండిని కొనుగోలు చేస్తుంటారు. అలాగే పేలపిండి, పండుగకు అవసరమైన పూలు, మామిడి ఆకులు, తమలపాకులు, అరటిపళ్లు వంటివాటిని కొనుగోలు చేయటానికి ప్రజలు శనివారం సాయంత్రం పెద్దసంఖ్యలో రావటంతో ఒంగోలులోని ప్రధాన వ్యాపార కూడళ్లు కిక్కిరిసిపోయాయి. దీంతో వ్యాపారులు సైతం ధరలు భారీగా పెంచారు. డజను అరటిపళ్లు రూ.100, కొబ్బరి కాయ రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ఇక పూల ధరలు సైతం భారీగా ఉన్నాయి. అయినప్పటికీ తప్పదంటూ ప్రజలు కొనుగోలు చేయటం కనిపించింది.

పలు ఆలయాల్లో వ్రతాలు

ఇక తొలి ఏకాదశి సందర్భంగా అనేక వైష్ణవ ఆలయాలలో ఆదివారం ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరంలోని శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానం, శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం, సీతారాంపురం శ్రీసీతారామస్వామి దేవస్థానం, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, ఐశ్వర్యనగర్ శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం మొదలైన అనేక ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈక్రమంలో ఆలయాలకు రానున్న దృష్ట్యా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా దేవస్థాన నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


ఒంగోలులో మామిడి ఆకులను కొనుగోలు చేస్తున్న మహిళలు


చంద్రపాడులో కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

సుపరిపాలన కూటమితోనే సుసాధ్యం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై5(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సుసాధ్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం రాత్రి చంద్రపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలనుంచి అందే వినతులను స్వీకరిస్తూ వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్ని ఇబ్బందులున్నా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యం పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,గొట్టిపాటి రాఘవరావు, దొడ్డా సుబ్బారావు,దొడ్డా వెంకట్రావు, వేల్పుల శ్రీనివాసరావు, కూనంనేని లోకేష్, కరుణాకరరెడ్డి, కనపర్తి ఆంజనేయులు, నల్లూరి శ్రీకాంత్, మన్నం శేషయ్య, శేఖరరెడ్డి, కరిచేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- చీమకుర్తి పట్టణంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, ముప్పూరి చలమయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధర రావు, గొల్లపూడి సుబ్బారావు, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో ఇంటింటి ప్రచారం

ఒంగోలు(రూరల్), జూలై5(ఆంధ్రజ్యోతి):: ఒంగోలు మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులుసు పరిపాలన తొలిఅడుగు ప్రచారంలో దూసుకుపోతున్నారు. శనివారం సర్వేరెడ్డిపాలెం, దశరాజుపల్లి, కరవది, చేజర్ల గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేరెడ్డిపాలెంలో జరిగిన కార్యక్రమంలో మక్కెన శ్రీనివాసరావు, మక్కెన బ్రహ్మయ్య, కాకి విజయ్, గంగుల విద్యాసాగర్, పుచ్చకాయల ప్రసాద్, అలాగే దశరాజుపల్లిలో మాలంపాటి కృష్ణరావు, యానాది నాయుడు, పులిచర్ల మోహన్‌రెడ్డి, మాలంపాటి భాస్కరరావు, పైనం శ్రీను, పాలేటి ప్రభాకరరావు, గనిపినేని శ్రీను, గనిపినేని పద్మ, బనిపినేని సుబ్బారావు, కరవదిలో పోలవరపు వెంకటరామయ్య, నలమోతు బాలగంగాదర్, మండల అధ్యక్షుడు గుండపనేని శ్రీనివాసులు, వలేటి రాంబాబు, పిల్లుట్ల సుధాకర్, శింగోతు వెంకటేశ్వర్లు, పోలవరపు శ్రీనివాసరావు, గద్దె వెంకటకృష్ణ, పవన్, తొట్టెంపూడి యల్లమంద, శేఖర్, రాజేష్, పరిశీలకులు పటాన్‌హనీఫ్ పాల్గొన్నారు.


సర్వేరెడ్డిపాలెంలో కరపత్రాలను అందిస్తున్న నాయకులు

750 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 750 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించినట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. అందుకోసం 344 ఎకరాల్లో గుంతులను కూడా తీశారని పేర్కొన్నారు. ఉపాధి పథకం అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో డ్వామా పీడీ సమీక్షించారు. మైక్రో ఇరిగేషన్ డ్రిప్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పండ్లతోటలకు ప్రతి ఒక్క రైతుకు డ్రిప్‌ను అనుసంధానం చేస్తామని, వేసవిలో కూడా నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 10వేల ఎకరాల్లో పండ్లతోటలను నాటాలని లక్ష్యంగా పెట్టుకొని ఉపాధి పథకం ద్వారా చేపడుతున్నట్లు చెప్పారు. అందుకోసం సన్నకారు రైతులకు 90శాతం, ఎస్సీఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి వి.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్, శ్రీనివాసులు

పారిశుధ్యంపై నూతన ఒరవడికి శ్రీకారం

ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజలకు సందేశాలు

దాని ఆధారంగా తంగెళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీపీవో

మర్రిపూడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రానున్న తరుణంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఏవిధంగా జరుగుతున్నాయో స్వయంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే గ్రామపంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను పెద్దఎత్తున విడుదల చేసింది. ఆ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో నామమాత్రంగా పనిచేసి అధికారులు నివేదికలను పంపుతున్నారని గ్రహించి ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంది. ఆ సమాచారంతో శనివారం మండలంలోని తంగెళ్ల గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో సంపద సృష్టి కేంద్రాలన్నీ మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, పంచాయతీ కార్యదర్శి సుధీర్ బాబు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీపీవో వెంకటనాయుడు

10న చలో విజయవాడ : పీడీఎస్‌యూ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ వద్ద శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం.సునీల్, సతీష్‌కుమార్, నాయక్, లక్ష్మణ్ నాయక్, హనుమంతరావు, పవన్, వెంకటేష్, సంపత్‌కుమార్, వసంత్, యోగేంద్ర, మదన్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

● మంత్రి స్వామి సమీక్ష

కొండపి/టంగుటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, అదేవిధంగా నియోజకవర్గంలోని రోడ్లను బీటీరోడ్లుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి స్వామి ఆదేశించారు. మంత్రి శనివారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి ఉన్నచోట కొత్తగా బోర్లు వేయించాలని ఆదేశించారు. రామతీర్థం నుంచి మర్రిపూడి మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పైపులైను లీకులు లేకుండా మరమ్మతులు చేయించాలని మంత్రి ఆదేశించారు. కొండపి ప్రాజెక్ట్ నుంచి రామతీర్థం నీటి సరఫరాపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. పారిశుధ్యానికి, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష చేసిన మంత్రి నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లపై బీటీ రెన్యూవల్స్ కోసం, కొత్త బీటీరోడ్లు, అవసరమైన చోట్ల లోలెవల్ కాజ్‌వేలు, చప్టాల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. వివిధ గ్రామాలను కలిపే ప్రధాన రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు అధికారులు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, డీఈ వేణుగోపాలరావు, ఏఈలు కిషోర్‌బాబు, పి.రమేష్, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎన్.మహేంద్రారెడ్డి, యు.జయపాల్, పాల్‌రాజ్ పంచాయతీరాజ్ ఎస్ఈ నిషాంత్‌హుస్సేన్, ఈఈ వై.కోటేశ్వరరావు, డీఈ జె.రవిబాబు, ఏఈలు ప్రసాద్, శేషగిరి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి స్వామి

మహిళల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ ● మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికపురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్‌పర్సన్లకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు, డీజీలక్ష్మిలకు 100 బయోమెట్రిక్ పరికరాలను ఇన్‌చార్జ్ కలెక్టర్‌తోపాటు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అందజేశారు. శనివారం స్థానిక ప్రకాశంభవనంలోని పీజీఆర్ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒంగోలులోని 164 ఆర్పీలకు వాటిని అందించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తన తల్లి కూడా స్వయం సహాయక సంఘం లీడర్‌గా పనిచేశారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధికారత సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నపుడే మహిళలకు ఆస్తిలో వాటా వచ్చేలా చట్టం చేశారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన కృషికి నిదర్శనమే డ్వాక్రా సంఘాల మహిళల విజయం అన్నారు. పీ-4 పథకం కింద లబ్ధి పొందేందుకు ఒంగోలు నియోజకవర్గంలో 10,700 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా కుటుంబాల అభివృద్ధి కోసం మెప్మా ఆర్పీలు తమవంతు సహకారం అందించాలని కోరారు. సుమారు రూ.30వేలు విలువైన ట్యాబ్‌లను ప్రభుత్వం అందజేయడంతోపాటు డిగ్రీ చదవిన మహిళలకు డీజీ లక్ష్మిలకు కామన్ సర్వీస్ సెంటర్ మాదిరిగా సేవలు అందిస్తూ ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్టర్ రమేష్ డాక్టర్ నితిన్ మాట్లాడుతూ తమ ఆసుపత్రి, మెప్మా ఒప్పందంతో మెప్మా మహిళలకు అన్ని మునిసిపాలిటీలలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని తెలిపారు. అవసరమైన వారికి వైద్యంలో 20 శాతం రాయితీ అందిస్తామని, రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీహరి, ఐటీ స్పెషలిస్ట్ పణికుమారి, టీఎల్ రాణి, ఏవో సునీల్, సమాఖ్య అధ్యక్షురాలు భారతి పాల్గొన్నారు.


ఆర్పీకి ట్యాబ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఏడాదిలోనే అభివృద్ధి.. సంక్షేమం వైపు అడుగులు

● ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలనలోనే అభివృద్ధి.. సంక్షేమం వైపు అడుగులు వేసిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 2, 50 డివిజన్లలో ఆయన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదరికం లేని సమాజం కోసం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని దామచర్ల తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని, త్వరలోనే ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నట్లు వెల్లడించారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను నిరంతరం పనిచేస్తున్నాని దామచర్ల పేర్కొన్నారు. ఒంగోలు నగర సుందరీకరణ, ప్రతిరోజు తాగునీరు, రోడ్లు, కాలువలు, పోతురాజు కాలువ ఆధునికీకరణ, అండర్ డ్రైనేజీ విధానంతో నగరాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరు పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే అర్హులైన నిరుపేదలకు 2 సెంట్లు ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

పోలురాధ పోటీల ప్రారంభం

కొత్తపట్నం: అల్లూరు గ్రామంలో రెండు రోజుల పాటు జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండి పోలురాధ పోటీలను శనివారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జాతి పశుసంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే ఒంగోలు జాతి ఎడ్లకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత గేనం సుబ్బారావు, మండల అధ్యక్షుడు ద్వారగాపుల శ్రీనివాసరెడ్డి, దాసరి పోలయ్య, శ్రీనివాసరెడ్డి, జయరావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలి

● ఎస్పీ దామోదర్

కొండపి/టంగుటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన టంగుటూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్‌ను, పోలీస్ స్టేషన్‌లోని గదులను, స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి సూచనలిచ్చారు. బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యను వినాలని సూచించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, విచారణను వేగంగా పూర్తి చేసి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను, ఇతర వస్తువులను త్వరగా డిస్పోజ్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కొండపి, పొన్నలూరు పోలీస్‌స్టేషన్లను ఎస్పీ దామోదర్ సందర్శించారు.


టంగుటూరు పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

రేపు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

● జిల్లా ఇన్‌చార్జి నరేంద్రబాబు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని సమితి జిల్లా ఇన్‌చార్జి సొట్ట నరేంద్రబాబుమాదిగ పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి మాదిగపల్లెలో ఘనంగా జెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమస్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందుతున్నాయన్నారు. ఆయన పిలుపు మేరకు సోమవారం సాయంత్రం 4గంటలకు ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే కృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని మాదిగ పల్లెల్లో పండుగలా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒంగోలులో సుమారు వెయ్యి ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు, వర్గీకరణ పోరాటంలో నిలబడిన మాదిగ పెద్దలకు సన్మానాలు చేస్తామని వివరించారు. మాదిగ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు, జాతీయ ఉపాధ్యక్షులు బొంతా ఏసుదాసు, జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్, ఎంఎస్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఆనంద్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరువీధుల బాబుమాదిగ, జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళూరి శేషయ్య, సహాయ కార్యదర్శి లక్కెబోయిన కోటేశ్వరరావు, పసుమర్తి ఇశ్రాయేలు, ప్రభాకర్, కనుమూరి సుబ్బారావు, గంగవరపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నరేంద్రబాబు, నాయకులు

జిల్లావ్యాప్తంగా 5,372 కేసుల పరిష్కారం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 5,372 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి తెలిపారు. లోక్ అదాలత్‌లో 155 సివిల్ వ్యాజ్యాలు, 5,200 క్రిమినల్ వ్యాజ్యాలు, 17 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కక్షదారులకు మోటార్‌వాహన బీమా కేసులతో పాటు ఇతర కేసుల్లో సుమారు రూ.8కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. కేసుల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా 27బెంచీలను ఏర్పాటు చేశామని, న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసులు, ఇతర అధికారులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని ఆమె అభినందించారు.

10న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విజయవంతం చేయాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 10వతేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిగేలా చూడాలని విద్యాశాఖాధికారులు, ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలను ఆయన ఆదేశించారు.

మాదిగ మహామేళాను జయప్రదం చేయాలి

ఒంగోలు కార్పొరేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన ఒంగోలులో జరగనున్న మాదిగ మహా మేళాను జయప్రదం చేయాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 3గంటలకు హెచ్‌సీఎం కాలేజీ దగ్గర నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు ఈదుమూడిలో

నాగులుప్పలపాడు: ఈదుమూడిలో ఈ నెల 7వ తేదీన జాతీయ ఎంఆర్‌పీఎస్ దినోత్సవం జరుగుతుందని రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి పి.కృపాకరమాదిగ పేర్కొన్నారు. శనివారం ఈదుమూడిలో ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏకేయూకు 75 ఎన్ఎస్ఎస్ యూనిట్లు మంజూరు

ఒంగోలు విద్య, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీకి కొత్తగా 75 ఎన్ఎస్ఎస్ యూనిట్లు మంజూరు చేసినట్లు ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ ప్రతినిధి ఎస్.సంజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఒంగోలు వచ్చిన ఆయన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తిని మర్యాదపూర్వకంగాకలిశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల పనితీరును అభినందించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్ దేవ్ కుమార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్‌ను వీసీ మూర్తి శాలువతో సత్కరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.


సంజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ మూర్తి

తొలి ఏకాదశి శుభాకాంక్షలు : మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. హిందువుల తొలిపండుగగా ఖ్యాతిచెందిన తొలి ఏకాదశి పండుగకు ప్రత్యేక స్థానముందన్నారు. ఆరోజున ఉపవాసం ఉండి జాగరణ చేసి శ్రీమహావిష్ణువును పూజిస్తే విశేష ఫలితాలు కలుగుతాయన్నారు. అందువల్ల తొలిఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాగుంట ఆకాంక్షించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, పశువులకు తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం నాయకులు కోరారు. శనివారం ఒంగోలులో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.రవిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వైపాలెం, మార్కాపురం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. నీటి కుంటలు, వాగుల్లో నీరు లేదన్నారు. దీంతో జీవాలు నీటి కోసం రోజుకు ఐదారు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్ల ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో నీటితొట్లు ఏర్పాటు చేశారని, వాటిలో నీరు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తోట తిరుపతిరావు, కె.పెద్దబ్బాయి, కండే బాలకృష్ణ, బొడ్డు రామరాజు, పూసపాటి వెంకట్రావు, కొండలరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ రవికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

సుబ్రహ్మణ్యేశ్వరరావుకు సత్కారం

ఒంగోలు(రూరల్), జూలై5 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా బదిలీపై వెళుతున్న ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావును వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని జిల్లా వనరుల కేంద్రంలో జరిగిన సత్కారసభలో ముఖ్యఅతిథిగా హాజరైన డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో వివిధ స్థాయిల్లో 25 సంవత్సరాలుగా సుబ్రహ్మణ్యేశ్వరరావు బాధ్యతలు క్రమశిక్షణతో నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరరావును శాలువలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యేశ్వరరావును సత్కరిస్తున్న అధికారులు

నోబిడ్‌లు లేకుండా చూడాలి : ఆర్ఎం

కొండపి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు పొగాకు బేళ్ల నోబిడ్ కాకుండా చూడాలని ఒంగోలు ఆర్ఎం శీలం రామారావు చెప్పారు. శనివారం ఆయన కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి తెచ్చిన పొగాకు బేళ్ల వేలాన్ని ఆయన పరిశీలించారు. సమావేశంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం కేంద్రం అధికారి జి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్ఎం రామారావు

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు మృతి

కొత్తపట్నం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈతముక్కల పెట్రోలు బంకు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టంగుటూరు మండలం వాసేపల్లిపాడుకు చెందిన దూడల నారాయణ(50) మృతి చెందాడు. నారాయణ ఈతముక్కల వెళ్ళి తిరిగి స్వగ్రమం వస్తుండగా పెట్రోలు బంకు వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వచ్చి ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో నారాయణ తలకు బలమైన గాయం కాగా 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణ మరణించాడు. సంఘటనా స్థలాన్ని కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముప్పా సురేష్ భార్యకు నోటీసులు

ఒంగోలు క్రైం, జూలై5(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో ముప్పా సురేష్ ప్రధాన సూత్రధారి కాగా ఆయన భార్య అనితకు పోలీసులు నోటీసులు అందజేయనున్నారు. ఈమేరకు శనివారం రాత్రి ప్రత్యేక పోలీసు బృందం ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈనెల 10వ తేదీన విచారణకు ఒంగోలులో పోలీసుల వద్ద హాజరుకావాలని నోటీసులు జారీ చేయనున్నారు. వీరయ్యచౌదరి హత్య చేసేందుకు హైదరాబాద్‌లోని ముప్పా సురేష్ ఇంట్లో పథకం రూపొందించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఇటీవల పోలీసు కస్టడీలోని నిందితులను విచారణ సమయంలో వెల్లడైనట్లు తెలిసింది. దీంతో పోలీసు బృందం హైదరాబాద్ బయలుదేరింది.

సాక్షుల సమక్షంలో మెగా పీటీఎం

ఒంగోలు విద్య, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఈనెల 10న జరగనున్న మెగా పీటీఎంను సాక్షుల సమక్షంలో నిర్వహించాలి. కార్యక్రమాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించాలి. సమావేశం ప్రారంభం నుంచి ముగిసే వరకు సాక్షులు కార్యక్రమాన్ని పరిశీలించి వారే నివేదికను లీప్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలకు సాక్షులను నియమించమనడం ఇదే ప్రథమం. ఇప్పటి వరకు పాఠశాలల్లో నిర్వహించే జాతీయపండుగులు, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, నివేదికలు సంబంధిత ప్రధానోపాధ్యాయులే అప్‌లోడ్ చేసేవారు. అయితే టీచర్లు ఇచ్చే నివేదికలపై నమ్మకం లేక ప్రస్తుతం సాక్షులను నియమించి వారి ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నారు. మెగా పీటీఎంకు సాక్షులుగా స్థానిక అడ్వకేట్లు, ప్రభుత్వ అధికారులు, అకౌంటెంట్లు, పోలీస్ అధికారులు తదితరులను నియమించుకోవాలి. సాక్షులను ఎంపిక చేసుకొనే అవకాశం హెచ్‌ఎంలకే ఇచ్చారు. శనివారం రాత్రి 9గంటలలోపు ఏ పాఠశాలకు ఎవరిని సాక్షులుగా నియమించారో వారి ఫొటో గుర్తింపు కార్డు, వారి ఈమెయిల్ అడ్రసును లీప్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వీరు 10వ తేదీ ఉదయం 8గంటలకు పాఠశాలలకు చేరుకోవాలి. సమావేశం ముగిసే వరకు మొత్తం సమయం పాఠశాలల్లోనే ఉండి కార్యక్రమాన్ని పరిశీలించాలి. అన్ని తరగతుల గదులు సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను గణించాలి. ఎంత మంది తల్లిదండ్రులు హాజరైంది కూడా లెక్కించమన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత లీప్‌యాప్‌లో నమోదైన వివరాలను పరిశీలించి సక్రమంగా ఉన్నట్లు సాక్షులు ధ్రువీకరించాలి.

విట్నెస్ అధికారి నియామకం రద్దు చేయాలి


పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో విట్నెస్ అధికారుల నియామకంపై యూటీఎఫ్ భగ్గుమంది. మెగా పీటీఎం లకు సాక్షులుగా పరిశీలకులుగా ఇతరుల నియామకానికి సంబంధించి సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌అబ్దుల్ హై, డి. వీరాంజనేయులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. పీటీఎంను ఒక డాక్యుమెంటరీ కార్యక్రమంగా మార్చవద్దని వారు హితవుపలికారు. ఆప్షనల్ హాలిడే కోసం టీచర్లను మతాలు, కులాలవారీగా విడగొట్టడం సరికాదన్నారు.

పీడీసీసీ బ్యాంకులో వినూత్న మార్పులకు శ్రీకారం

- చైర్మన్ సీతారామయ్య



ఒంగోలు విద్య, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పీడీసీసీ బ్యాంకులో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో, 34బ్యాంకు శాఖల్లో సోమవారం ఈ ఆఫీసు సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు రికార్డులన్ని డిజిటల్ లైజేషన్ చేస్తున్నామన్నారు. వచ్చేవారంలో ద్విచక్రవాహనాలకు లోన్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంతో పాటు 34 శాఖల్లో అధికారులు, సిబ్బందికి ఈ హాజరు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్, ముఖ హాజరు ప్రవేశపెడుతున్నామని తెలిపారు. అలాగే బ్యాంకు ఆవిర్భవించి 50 సంవత్సరాలుకావస్తున్న నేపథ్యంలో స్వర్ణోత్సం పేరుతో బ్యాంకులో కొత్త డిపాజిట్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ సీతారామయ్య తెలిపారు. ఈనెల 10నుంచి ఈపథకం అమలులోకి వస్తుందన్నారు.



ఆనందం వెనుక అనారోగ్యం..!

- అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష
- పెట్స్‌పై పెరుగుతున్న ఆసక్తి
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

పెంపుడు జంతువులు కనబరిచే విశ్వాసం, దానిపట్ల మనకుండే ఆత్మీయత మనసుకు ఎంతో ఉల్లాసాన్నిస్తున్నా.. వాటి వెనుక ప్రాణాలు హరించే అంటురోగాల ప్రమాదం పొంచి ఉందని పశు సంవర్ధక శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. మాంసాహారం తినే జంతువులైన కుక్కలు,నక్కలు, పిల్లులతో పాటు కోతులు, ఇలాంటి జంతువుల వలన మనుషులకు తెలియని విధంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. వాటిలో రేబిస్ (పిచ్చి) ప్రమాదకరమైంది.

ఒంగోలు కార్పొరేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అయితే నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులపై ఆసక్తి చూపుతూ, వాటి ఆలనా, పాలన చూసుకుంటూ ఆనందంగా గడపడానికి ఇష్టపడుతుంటారు. అయితే ఆనందం వెనుక అనారోగ్యం కూడా ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జూనోసిస్ డే ఎందుకు జరుపుకుంటారు

మనుషుల కపట ప్రేమకంటే జంతువుల కల్మషం లేని ప్రేమ నయమనిపిస్తుంది. జంతువులను మరింత అమితంగా ప్రేమించే మనుషులు నేడు ఉన్నారు. ఇళ్లలో పెరిగే జంతువులను కుటుంబ సభ్యుల్లా భావించి, ఆలనా, పాలన చూసుకోవడమే కాకుండా పుట్టిన రోజు వేడుకలను జరిపేవారు ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఆనందంతోపాటు అప్రమత్తం కూడా ముఖ్యమేనని, పెంపుడు జంతువులను ప్రేమించే ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఆరోగ్య శ్రద్ధలు పాటించాలని పశు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. 1885 సంవత్సరంలో లూయి పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా పిచ్చికుక్క కాటుకు గురై, రేబిస్ వ్యాధి సోసిన బాలుడుకి టీకా వేసి రోగ విముక్తిడిని చేశారు. దీంతో ప్రతి ఏటా జూలై 6ను ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా, యాంటీ రేబిస్ డేగా పాటిస్తారు.

విశ్వాసానికి ప్రతీక

కుక్కల్ని గ్రామ సింహాలంటారు. ఇవి గ్రామంలో ఉంటే దొంగలు ఊరిలోకి రావడానికి భయపడిపోతుంటారు. ఊరంతా నిద్రపోయినా, కుక్కలు నిద్రపోవు. చిన్న చప్పుడు వచ్చిన అప్రమత్తంగా ఉంటాయి. కాస్త అన్నం పెడితే చాలు విశ్వాసంగా పడి ఉంటాయి. శునకాలకు అసూయ, ఈర్ష్య, ద్వేషాలు అసలే ఉండవు, పెట్టిన అన్నంకు జీవితాంతం విశ్వాసాన్ని చూపుతాయి. ప్రత్యేకించి ఇళ్లలో పెంచుకునే కుక్కలు యజమానికి కాస్త అనారోగ్యంగా ఉన్నా తిండి ముట్టవు. యజమానికి ఆపద వస్తే అసలే ఊరుకోవు. దీంతో ప్రతి ఒక్కరూ కుక్కలను పెంచడానికి ఆసక్తి చూపుతారు. ఇటీవల కాలంలో అయితే కుక్కలకు పుట్టిన రోజు వేడుకలు కూడా జరిపి కేక్ కటింగ్‌లు చేసి సంబరాలు జరుపుకున్నవారు ఉన్నారంటే ఆశ్చర్యపోవాల్సిందే.

నేడు వ్యాక్సినేషన్

ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి స్థానిక సంతపేటలోని పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ వేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. సాధారణ రోజుల్లో ఈ ఇంజక్షన్ వేయించుకోవాలంటే డబ్బులు ఖర్చు చేయాల్సిందే. అయితే ప్రపంచ పెంపుడు జంతువుల దినోత్సవం సందర్భంగా ఉచితంగా వ్యాక్సిన్ చేయనున్నారు. పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.



గంజివారిపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఫారెస్టు అధికారులు

పాలంక పుణ్యక్షేత్రానికి తరలిన భక్తులు

- నేడు తొలి ఏకాదశి పండుగ
- ఫారెస్టు అధికారుల తనిఖీలు
- ఉచిత వైద్య శిబిరం, అల్పాహారం, భోజనాలను ఏర్పాటు చేసిన సంఘాలు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నల్లమల కొండల మధ్యలో వెలసిన పాలంక వీరభద్ర పుణ్య క్షేత్రానికి శనివారం భక్తులు బయలుదేరారు. ఆదివారం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వాహనాల్లో బయలుదేరారు. ఎర్రగొండపాలెం నుంచి భక్తులు వాహనాలకు పూజలు నిర్వహించి పయనమయ్యారు. అటవీ ప్రాంతంలో ఈ పుణ్యక్షేత్రం ఉండడంతో సరైన వసతులు ఉండవు. దీంతో పట్టణం నుండే అన్ని రకాల సరుకులను తీసుకెళ్లారు. స్వామి కరుణ కోసం నలుమూలల నుంచి చిన్న పెద్ద తేడా లేకుండా వాహనాల్లో బయలుదేరారు. మార్గమధ్యలోని గంజివారిపల్లి సమీపంలోని శాంతినగర్ వద్ద ఫారెస్టు అధికారులు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. వచ్చిపోయే వాహనాలకు తనిఖీలు చేపట్టారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పలు చోట్ల పలు సంఘాల నాయకులు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అల్పాహారాలు, భోజనాలను ఏర్పాటు చేశారు. పాలంక క్షేత్రంలో భక్తులకు ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జగ్రత్తగా వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌లను సిద్ధం చేశారు. నల్లమల అటవీ ప్రాంతం కావడంతో రాత్రి వెలల్లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అక్కడే జాగారం చేసి సోమవారం భక్తులు తిరుగు ప్రయాణం అవుతారు.

వ్యవసాయ కార్పొరేటీకరణను అడ్డుకునేందుకు ఐక్య ఉద్యమాలు

- ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు అమ్రారామ్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేసే ప్రయత్నాలను అడ్డుకొనేందుకు రైతాంగ ఐక్య ఉద్యమాలే ఏకైక మార్గమని ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, రాజస్థాన్‌కు చెందిన పార్లమెంట్ సభ్యుడు అమ్రారామ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బృందావనం ఫంక్షన్ హాలులో జరిగిన 'వ్యవసాయ రంగంపై ప్రభావం' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు అధ్యక్షతన జరిగిన సభలో అమ్రారామ్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలుకు హామీ ఇచ్చిన ప్రధాని మోదీ తిరిగి రైతాంగ ఉద్యమానికి దారి తీసే పరిస్థితులను సృష్టించారని అన్నారు. వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం పాటు ఢిల్లీలో రైతు సంఘాల ఐక్య ఉద్యమంతో సాగిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో రైతులు చేసిన ఉద్యమం వల్ల రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి బర్లీ పొగాకును కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య మాట్లాడుతూ అమెరికాతో భారత్ చేసుకున్న వ్యవసాయ ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డి మాండ్ చేశారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించిన కేంద్రం అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంయుక్త మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, బాలకోటయ్య, పెంట్యాలహనుమంతరావు, బెజవాడ శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఊసా వెంకటేశ్వర్లు, చిన్నపరెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రవేశపెట్టిన తీర్మానాలను సదస్సులో ఏకగ్రీవంగా ఆమోదించారు. వర్జీనియ పొగాకులో లోగ్రేడ్‌కు ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా క్వింటా రూ. 20వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని,మిర్చి రూ. 20 వేలకు కొనుగోలు చేయాలని, శనగలపై ప్రభుత్వం 30 శాతం దిగుమతి సుంకాన్ని అమలు చేసి రూ. 10వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని తదితర తీర్మానాలను చేశారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, రాజస్థాన్‌కు చెందిన పార్లమెంట్ సభ్యుడు అమ్రారామ్

త్వరలో మార్కాపురం జిల్లా

- ఎంపీ మాగుంట

గిద్దలూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని ఎంపీ మాగుంట చెప్పారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గిద్దలూరు వచ్చిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిలు శనివారం ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. అలాగే గిద్దలూరు పట్టణాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు తాను, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పట్టుదలతో ఉన్నట్లు పేర్కొన్నారు. తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అభివృద్ధి విషయంలో మంచి సూచనలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణానికి సగిలేరు నీటి ముంపు నుంచి రక్షించేందుకు వీలుగా సగిలేరు అభివృద్ధి పనులకు రూ.38కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగనాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కమిషనర్ రమణబాబు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు జిలకర సత్యం, దమ్మాల జనార్దన్, తుమ్మలపెంట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వ్యాపారుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి అన్నారు. తొలుత పట్టణంలోని అమ్మవారిశాలను సందర్శించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్యులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యులను ఉద్దేశించి ఎంపీ మాగుంట మాట్లాడుతూ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఉదహరించారు. పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఏడాదిపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

మొహర్రం వేళ.. మద్యం మేళా

- రూ.3.20 లక్షలకు గొలుసు దుకాణం వేలం
- ఖాసీంస్వామి భక్తుల విస్మయం

తర్లుపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగకు మద్యం ఏరులై పారేందుకు తుమ్మలచెరువులో వేలంపాట నిర్వహించారు. రూ.3.20 లక్షలకు ఓ వ్యక్తి పాటపాడి దక్కించుకున్నారు. దీంతో ఖాసీంస్వామి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆది, సోమవారాలలో ప్రతిష్టాత్మకంగా పెద్ద సరిగెత్, పీర్ల నీళ్ల తాకే కార్యక్రమాలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఆదివారం రాత్రి నిర్వహించే పెద్ద సరిగెత్ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు హుబ్లీ నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఇక్కడికి సంతానం లేనివారు, వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వస్తుంటారు. ఎంతో గుర్తింపు పొందిన తుమ్మలచెరువులో అసాంఘిక కార్యక్రమాలపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో జనవాసాల మధ్య మద్యం అక్రమ వ్యాపారానికి దుకాణం ఏర్పాటు చేస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు కూడల్లో గొలుసు దుకాణం

నలు దిక్కుల నుంచే వచ్చే భక్తులకు బహిరంగంగా మద్యం అమ్మడానికి వేలం నిర్వాహకుడు సన్నాహాలు చేసుకుంటున్నారు.

పట్టించుకోని ఎక్సైజ్, పోలీసులు

తుమ్మలచెరువు దర్గా వద్ద వేలంపాట నిర్వహించిన సమాచారం తెలిసినప్పటికీ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కిమ్మనకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గురువారం రాత్రి జరిగిన చిన్న సరిగెత్ కార్యక్రమంలో కూడా యథేచ్ఛగా మద్యం విక్రయించినప్పటికీ పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు.పెద్ద సరిగెత్‌కైనా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10 రోజులుగా నీటి సరఫరా బంద్

ఖాళీ బిందెలతో యల్లారెడ్డిపల్లి వాసుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లారెడ్డిపల్లి గ్రామంలో 10 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచి పోయింది. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో శనివారం స్థానికులు ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. గ్రామంలో గత పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని దీంతో నీటి సమస్య పెరిగిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. గ్రామంలో ఉన్న బోరు మరమ్మతులకు గురైందని, సాగర్ జలాలు కూడా రావడం లేదని తెలిపారు. రెండు, మూడు కుటుంబాల వారం కలసి రూ.600 పెట్టి నీటి ట్యాంక్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మేలో వర్షాలు.. జూన్‌లో ఎండలు



అడుగంటిన కంభం చెరువు



మేలో ఏపుగా పెరిగిన మిర్చి



జూన్‌లో దుక్కి దున్ని వదిలేసిన భూమి

- బీళ్లుగా మాగాణి భూములు
- కంభం సబ్ డివిజన్‌లో విచిత్ర పరిస్థితులు
- ఆందోళనలో రైతులు

కంభం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రానురాను వాతావరణ పరిస్థితి విచిత్రంగా మారిపోతున్నాయి. గతంలో వర్షాలు ఊరికి ఊరికి వ్యత్యాసం చూపిస్తే ఇప్పుడు వీధికి వీధికి కనిపిస్తున్నాయి. కంభం సబ్ డివిజన్‌లోని కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లో ఈ ఏడాది అలాంటి పరిస్థితులు స్పష్టంగా ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. దీనితో సాగు పనులు ముమ్మరంగా మొదలయ్యాయి. కీలకదశలో చినుకులు ముఖం చాటేశాయి. తొలకరి పంటలు సాగుపట్ల రైతు ఆశలు సన్నగిల్లుతున్నాయి. ముమ్మరంగా వర్షాలు కురిసి వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావలసిన తరుణంలో ఎండలు మండిపోతున్నాయి. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు వానలు కురవక అరకలు సాగే వీలులేక ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ దాటుతున్నా పంటల సాగుకు అనువైన వర్షం పడిన దాఖలాలు కనిపించడం లేదు. సాధారణంగా మేలో కంభం సబ్ డివిజన్‌లో 6వేల హెక్టార్లలో పైర్లు సాగు కావలసి ఉన్నప్పటికీ కేవలం వెయ్యి ఎకరాలలో మాత్రమే ప్రస్తుతం సాగులో ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ముమ్మరంగా ఖరీఫ్ పంటలు సాగు అయ్యేవి. మేలో వర్షాలు ప్రారంభమై జూన్, జూలైలో మోస్తరు వర్షం నుంచి భారీ వర్షాలు కురవాలి, కానీ ఈ ఏడాది కూడా చినుకు జాడలేదు. ఇక చెరువు కింద మాగాణి భూములు బీళ్లుగా మారాయి. కంభం చెరువు కింద చివరి ఆయకట్టులో 10 సంవత్సరాలకు పైగా సాగుకు నోచుకోలేదు. పశ్చిమ ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడంతో చారిత్రాత్మక కంభం చెరువులో నీరు అడుగంటింది. చెరువు కింద సేద్యం సాగక పశుగ్రాసం కొరత తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉంది. అరకొర వర్షాలు మెట్టపంట రైతులకు ఆనందం కలిగిస్తున్నప్పటికీ మాగాణి రైతుల గుండె చెరువు అవుతుంది. వాతావరణం అనుకూలిస్తే కంభం సబ్ డివిజన్‌లో 4500 ఎకరాల్లో పత్తి, 2000 ఎకరాల్లో కంది, 1500 ఎకరాల్లో ఆముదం, 1200 ఎకరాల్లో మమొక్కజొన్న, 1800 ఎకరాల్లో ఇతర పంటలు సాగులో ఉండాలి. జూలైలో మిరపను 6వేల హెక్టార్లలో వేసేవారు. రబీ సీజన్ వచ్చే సరికి పత్తి, కంది, ఆముదం పంటలు చేతికి అందుతాయి. ఆ డబ్బులతో రెండో పంట సాగుగా మిరపకు వినియోగిస్తారు. ఈ ఏడాది తొలకరి సాగుపై రైతులు దాదాపు ఆశలు వదులుకునే పరిస్థితి. మేలో 6 ఎంఎం వర్షపాతం నమోదు కాగా, జూన్ 60 నుంచి 65 ఎంఎం వర్షాలు కురవాల్సి ఉండగా.. కేవలం 5ఎంఎం కూడా నమోదు కాలేదు. అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. జూలై, ఆగస్టులోనైనా వర్షాలు సంవృద్ధిగా కురవాలని వేడుకుంటున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌కు స్థల పరిశీలన

పుల్లలచెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఐటివరం గ్రామంలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈనెల 11వ తేదీన జరిగే ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి, బాలవీరాంజనేయులు, ఎంపీ మాగుంట హాజరవుతారని తెలిపారు. ఈ పరిశీల నలో టీడీపీ నాయకులు పయ్యావుల ప్రసాద్, సుబ్బారెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తాం

రాచర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యలు తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. కార్యాలయ సమావేశం హాలులో ఎంపీపీ షేక్ ఖాశింబి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భగా సమావేశంలో పలువురు సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా ఆయన పై విధంగా స్పందించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సంబంధిత అధికారులతో కలిసి సమస్యలను సామరస్యంగా చర్చించుకుంటే త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ వెంకటేష్, ఎంఈవోలు షేక్ మొయినుద్దీన్, గిరిధర్‌శర్మ, అధికారులు పాల్గొన్నారు.



పొదిలి డిపోను పరిశీలిస్తున్న నెల్లూరు జోన్ ఆర్టీసీ చైర్మన్ సురేష్‌రెడ్డి

కార్మికులను గాలిలో ఉంచిన వైసీపీ

ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సురేష్‌రెడ్డి

పొదిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. కానీ ఎలాంటి బెనిఫిట్స్ కల్పించకుండా ఉద్యోగులను, డిపోలను గాలిలో ఉంచిదని ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం పొదిలి డిపోను ఆయన తనిఖీ చేశారు. విలీనం చేసినా అవసరమైన నిధులు, ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. అంతే కాకుండా డిపోలను తాకట్టుపెట్టిందన్నారు. వచ్చిన ధనం ఆర్టీసీకి ఖర్చు చేసి ఉంటే అభివృద్ధి చెందేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. దీంతో బస్సులు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పాడైన బస్సుల స్థానంలో ఇప్పటికే మూడువంతులు కొత్తబస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్న తరుణంలో అన్ని డిపోలను సందర్శించి అక్కడ సౌకర్యాలపై దృష్టిసారించామన్నారు. డిపోలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శంకరావు, ఆర్టీసీ సీఐ ధనలక్ష్మి, బీజేపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు ఆర్టీసీ డిపో ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సహాయ కార్యదర్శి సుబ్బశాస్త్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. ఆరేళ్ల పెండిగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న 10వేల మంది సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ బాషా హుస్సేన్ మాట్లాడుతూ.. ఆర్టీసీనే సొంతంగా ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేయాలన్నారు. ప్రైవేట్ ఆపరేటర్‌లకు ఎలక్ట్రిక్ బస్సులను లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని కోరారు.

వసతి గృహం ప్రారంభం

ఎర్రగొండపాలెం, జులై 5 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలో గిరిజన బాలికల కళాశాల ఆవరణలో శనివారం నూతనంగా నిర్మించిన వసతిగృహ భవనాన్ని టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిరిజన బాలికలు వసతిగృహ భవనం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రులు లోకేష్, డోలాశ్రీవీరాంజనేయస్వామి దృష్టికి తీసు కెళ్లగా నిధులు మంజూరు చేయించి, ఏడాది లోపు కొత్తభవనం నిర్మాణం చేసారని ఎరిక్షన్‌బాబు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబోజన పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీడీ పీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, శనగా నారాయణరెడ్డి, వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను, సుబ్రహ్మణ్యం, మహేష్, సేవ్యానాయక్, మంత్రునాయక్, షేక్ మస్తాన్ వలి, వార్డెన్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు నష్టం తెచ్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. స్థానిక పారిశ్రామిక వాడలో ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జీపు జాతాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి అమలు చేయాలన్నారు. డిజైన్ స్లేట్ పరిశ్రమను ఆదుకొని కార్మికులకు ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి, నాయకులు రూబెన్, నాగరాజు, బాలశేషయ్య, ప్రకాశం, రాములు పాల్గొన్నారు.

గిద్దలూరు : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గిద్దలూరులోని పలు సెంటర్లలో జీపుజాతా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముఠా వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్, ఆటోస్టాండ్ తదితర ప్రాంతాలలో జరిగిన ప్రచార కార్యక్రమంలో జంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రఫి, రూబిన్, స్థానిక నాయకులు ఆవులయ్య, నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా :ఎంపీ మాగుంట

రాచర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయాన్ని శనివారం ఆయన, ఎమ్మెల్యే అశోక్ రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో నాగయ్య, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు వారికి మేళతాళాలతో స్వాగతం పలికారు. ముందుగా ఆయన లక్ష్మమ్మ వనంలోని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నెమలిగుండ్ల రంగనాయకుని ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారితో పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ అధికారులు, అటవీశాఖ అధికారుల ద్వారా క్లియరెన్స్ విషయంలో ఇబ్బందులు ఎదరవుతున్నాయని తద్వారా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఎంపీ దృష్టికి తీసుకురాగా ఆయన అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో ఎస్ నిషాకుమారి (ఐఎఫ్ఎస్), ఎఫ్ఆర్‌వో మధు ప్రియాంక, డీఆర్‌వోలు వంశీకృష్ణ కుమారి, బాలాజీ నాయక్, ఎఫ్ఎస్‌వో రామయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, టీడీపీ నాయకులు యోగానంద్, జీవనేశ్వర్ రెడ్డి, సనావుల్లా ఖాన్, ఎస్.శ్రీనివాసులు, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మొహర్రంకు సర్వం సిద్ధం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని పెద్ద బోయలపల్లి గ్రామంలో 5 రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి చిన్న సరిగెత్తు నిర్వహించారు. శనివారం రాత్రి పీర్లు చావిడిలో కొలువుదీరాయి. గ్రామంలో ముస్లింలు, దూదేకులవారు లేకపోయినా మొహర్రంను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పెద్ద సరిగెత్తు (మొహర్రం) సందర్భంగా అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం పీర్లను నీళ్లలో ముంచే కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

7 మద్యం సీసాలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో శనివారం తెల్లవారుజామున ఎక్సైజ్ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ డి.మౌళాలి సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద 7 మద్యం సీసాలు దొరికాయి. పోలీసులను చూసిన ఆ వ్యక్తి బ్యాగ్‌ను వదిలివేసి పరారయ్యాడు. ఎక్సైజ్ పోలీసులు ఆ మద్యం సీసాలను స్వాధీనం చేసుకోగా 6 ఫుల్‌బాటిల్స్, హాఫ్ బాటిల్స్ ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జయరావ్ తెలిపారు. దాడిలో సిబ్బంది రహమతుల్లా, బి.వెంకటేశ్వర్లు, హరిబాబు పాల్గొన్నారు.



శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు

వైభవంగా చెన్నకేశవుని శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు బాబా పాదుకల నగరోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ బజారులోని సాయిబాబా మందిరం నుంచి బాబా పాదుకల నగరోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు శనివారం తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా షిరిడీ నుంచి వచ్చిన సాయి బాబా స్వయంగా స్పృసించిన పాదుకలు మార్కాపురం ఆదివారం ఉదయం 8గంటలకు నగరోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

రాజీ ద్వారా సమయం, ధనం ఆదా

జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకుంటే విలువైన సమయం, ధనం ఆదా అవుతుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులకు నమోదైన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకుని అప్పీలు లేని అవార్డును పొందాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె.భరత్‌చంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషశైనారెడ్డి పాల్గొన్నారు. లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు 16, డిక్రీ అమలు కేసులు 9, పార్టిషన్ కేసు 1, బీఎస్ఎన్ఎల్ 10, సివిల్ 40 పరిష్కారం కాగా, ఇందుకు సంబంధించి రూ.1,07,83,154 లావాదేవీలు జరిగాయి. క్రిమినల్ కేసులు 62, ఎక్సైజ్ కేసులు 21, భరణం, గృహహింస కేసులు 10, చెక్‌బౌన్స్ కేసులు 3, అడ్మిషన్లు 118 పరిష్కారమైనట్లు తెలిపారు.

ఇద్దరు బలవన్మరణం

మార్కాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పలు రకాల కారణాలతో మార్కాపురం పట్టణంలో ఇద్దరు బలవన్మరణం చెందిన ఘటన శనివారం వెలుగుచూసింది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. పట్టణంలోని 33వ బ్లాకు పరిధిలో నివాసముంటున్న నూతలపాటి చెన్నకేశవులు (36) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందారు. గత కొన్నాళ్లుగా ఎలాంటి పనీపాటు లేకుండా తిరుగుతున్న చెన్నకేశవులును భార్య ఆగ్నేషమ్మ మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. 20 రోజుల కిందట ఆగ్నేషమ్మ మండలంలోని దరిమడుగు గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో మద్యానికి బానిసైన చెన్నకేశవులు శనివారం మద్యం సేవించి ఇంట్లో ఎవరూలేని సమయంలో సాయంత్రం 4.00 గంటలకు ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తల్లిదండ్రులు కొండయ్య, లక్ష్మీదేవిలు గమనించారు. అప్పటికే చెన్నకేశవులు మృతిచెందారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు భయంతో యువకుడి ఆత్మహత్య

పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన వెన్నం కృష్ణయ్య కుటుంబం మార్కాపురం పట్టణంలో నివాసముంటోంది. చిన్న కుమారుడు రాంబాబు గ్రామంలో ఓ కేసులో ఇరుక్కోవడంతో మార్కాపురం వచ్చారు. క్రిష్ణయ్య ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ పనిచేస్తున్నాడు. కేసు విషయమై రాంబాబు తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాంబాబును స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

గోవా మద్యం సీజ్

కంభం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో కంభం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేయగా ఒక బ్యాగ్‌లో 4.7 లీటర్ల గోవా మద్యం కనుగొని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మద్యం తీసుకుని వెళ్తున్న వ్యక్తి పారిపోయినట్లు చెప్పారు.

ప్రజా ప్రభుత్వంతోనే సుపరిపాలన

- ఎంపీ మాగుంట
- 16వ వార్డులో తొలి అడుగు
- రూ.1.80కోట్లతో నిర్మించే పాములపల్లె రోడ్డుకు శంకుస్థాపన



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బ్రహ్మంచౌదరి, ఎరిక్షన్‌బాబు

గిద్దలూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే పలు రోడ్లను ఎంపీ ప్రారంభించారు. ఈసందర్భంగా 16వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి గడిచిన ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయనున్నారన్నారు. మరో రెండు నెలల్లో నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. గిద్దలూరులో నీటి ఎద్దడిని నివారించేందుకు రూ.160కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, సగిలేరువాగు ముంపు ప్రాంతంలో రక్షణ గోడ ఏర్పాటు చేయడం, పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.30కోట్లు కేటాయించిందని మాగుంట పేర్కొన్నారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఆయన తెలిపారు.

పాములపల్లె రోడ్డుకు శంకుస్థాపన

అధ్వానంగా ఉన్న పాములపల్లె రహదారికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కృషితో రూ.1.80కోట్ల నిధులు మంజూరు కాగా శనివారం ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. 16వ వార్డులో 39 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, పాముల వెంకటరమణ, కుప్పా రంగసాయి, పట్టణ అధ్యక్షుడు షానేషావలి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైల్వేగేటు వద్ద బ్రిడ్జి నిర్మించాలి

పట్టణంలోని రాచర్లగేటు వద్ద తరచూ గేటు పడడం వలన ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని, తద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

పెద్ద దోర్నాల : ప్రజా పభుత్వంతోనే రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని టీడీపీ ఇన్‌చార్జి గూ డూరి ఎరిక్షన్‌బాబు, పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి పేర్కొన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి వీధిలో సుపరిపాలన లో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బంతి పూల వర్షాన్ని కురిపించారు. వీధులు పసుపువర్ణంలా మారా యి. ఈ క్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన సం క్షేమం, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఏడాది పాలనలో వైసీ పీ పాలనకు, ప్రజా ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. జగన్‌రెడ్డి హామీలను, అభివృద్ధిని విస్మరించారని అందుకే ప్రజలు ఆపార్టీకి బుద్ధి చెప్పారన్నారు. బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ ఏడాది పాలనలో విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు రాష్ట్రం సాగుతోందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను ప్రజలకు వివరించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చే యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, వెచ్చా హర గోపాల్, షేక్ సమ్మద్ బాషా, దేసు నాగేంద్రబాబు, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ మంజూర్‌బాషా, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కేతి మురళి, ప్రసాద్, బీజేపీ నాయకుడు వీరారెడ్డి, ఎర్రగొండపాలెం నాయకులు మల్లికార్జున నాయుడు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతులకు ఇక్కట్లు

ఏవో ఆకస్మిక తనిఖీ - సరుకు ఇవ్వాలని ఆదేశం

కొమరోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న తరుణంలో కొందరు ఎరువుల డీలర్లు స్వార్థంతో వ్యవహరిస్తున్నారు. రైతులకు అవసరమైన యూరియా నిల్వ ఉన్నా కుంటి సాకులు చెప్పి ఇవ్వడం లేదు. కొమరోలు మండలంలో గత నాలుగు రోజులుగా ఈ వ్యవహారం జరగడంతో విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ కొమరోలులోని కోరమండల్, జనతా రైతు బజార్‌ల్లోని ఎరువుల దుకాణాల్లో యూరియా లేకపోవడంతో ప్రముఖ దుకాణాల్లో నిల్వ భారీగా ఉన్నా రైతులకు ఇవ్వలేదు. రైతులకు ఏటీపీ మిషన్ సర్వర్ సమస్య ఉందని, పాత యూరియా సుమారు 738 బస్తాలు నిల్వ ఉండగా, శనివారం ఉదయం కొత్తగా మరో 580 బస్తాలు వచ్చాయి. గ్రోమోర్, జనతాలో రూ.265 కాగా బయట షాపుల్లో రూ.380కి విక్రయిస్తున్నా ఇవ్వకుండా పక్క జిల్లాకు బ్లాక్‌లో అమ్ముకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఏవో రాజశ్రీ దుకాణాలను తనిఖీ చేయగా 900 బస్తాలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. రైతులకు సరుకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించగా, మిషన్ పనిచేయడంలేదు చెప్పారు. పేర్లు తీసుకొని వెంటనే సరుకు ఇవ్వాలని వారు ఆదేశించారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం

ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీటన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం స్థానిక 29వ వార్డులో శనివారం ఉదయం జరిగింది. ముందుగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వంసంవత్సర కాలంలో సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పథకాల వివరాల కరపత్రాలు అందించి వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున్, రామిరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, షేక్ షెక్షావలి, తాళ్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. పొదిలి మండలం అన్నవరంలో జరిగిన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అందరూ సహరించాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో శనివారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ బండి లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సభ్యులు అడిగిన సమస్యలకు పరిష్కార మార్గాన్ని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ మినరల్ వాటర్‌ప్లాంట్ల పరిస్థితి, గ్రామాలలో నీటి నాణ్యత, ఫ్లోరిన్ శాతం వివరాలపై అధికారిని అడిగారు. ఉపాధి పథకంలో కూలీల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కార్యక్రమానికి ప్రొటోకాల్ పాటించకుండా తమను అవమానపరిచారన్నారు. సమావేశంలో ఏవో బుజ్జిబాయి, ఎంఈవో రాంధాస్ నాయక్, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఏపీవో నాగరాజు, వెటర్నరీ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, హెచ్‌వో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, ఆసుపత్రి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముఖాముఖి

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

డాక్టర్ ఎస్.యషిత, వైద్యాధికారిణి, పీసీపల్లి



ప్రశ్న: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఉపయోగించని ఖాళీ తొట్లను బోర్లించడంతో పాటు కొబ్బరిటెంకలు, ఉపయోగించని గిన్నెలు, డబ్బాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

ప్ర: పీహెచ్‌సీలో ఎంతమంది వైద్యులు ఉండాలి?ఎంతమంది ఉన్నారు?

జ: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఇద్దరు వైద్యులు, ఒక ఆప్తమాలజీ ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు వ్యైదులు ఉన్నారు. ఆప్తమాలజీ పోస్టు ఖాళీగా ఉంది,

ప్ర: వైద్యశాలలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జ: ఏఎన్‌ఎంల కొరత ఉంది. 13 సచివాలయాల పరిధిలో 13మంది ఏఎన్‌ఎంలు ఉండాల్సి ఉండగా పది మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ముగ్గురిని నియమించారు. ఆ ముగ్గురు విధుల్లో చేరాల్సి ఉంది.

ప్ర: సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయా?

జ: అన్ని వ్యాధులకు వైద్యశాలలో మందులు అందుబాటులో ఉన్నాయి. ఇండెంట్ పెట్టిన వెంటనే వైద్యశాలకు అవసరమైన మందులను ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

ప్ర: కుక్కకాటు, పాముకాటుకు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉన్నాయా?

జ: కుక్కకాటు, పాముకాటుకు సంబంధించి రేబిస్, వీనమ్ ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉన్నాయి. రేబిస్ 1100 డోసులు, వీనమ్ 50 డోసులు అందుబాటులో ఉన్నాయి.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

వైభవంగా వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం

ముండ్లమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లులో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి 18వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస కల్యాణంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థినికి సాయం

ముండ్లమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన వేముల చిన అంజిబాబు, సైదాబీల కుమార్తె ఆసిని ఈఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో 528 మార్కులు సాధించారు. దీంతో గ్రామానికి చెందిన బిల్డర్ వాతల శ్రీనివాసరెడ్డి రూ.10,116 నగదు సాయాన్ని అందజేశారు. ప్రతిఏడాది వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం సందర్భంగా పదో తరగతి టాపర్‌కు బహుమతి అందజేస్తున్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

పామూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కార్మికల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహంచనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు పిలుపునిచ్చారు. సమ్మెప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.ప్రభాకర్, పి.మస్తాన్‌రావు, ఆర్.సూరిబాబు, ప్రసాద్, ఆంజి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

పామూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా దేవస్థానంలో ఈనెల 10న జరగనున్న గురుపౌర్ణమి వేడుకలు సందర్భంగా నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి కేసీపీ సిమెంట్ అధినేత్రి ఇందిరాదత్తు రూ.2 లక్షల విరాళం అందచేసినట్లు దేవస్థాన చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని పాత పోస్టాఫీసు ఎదురుగల షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా సాయి భక్తులకు ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఆమె తమ వంతుగా విరాళం అందజేస్తుంటారని తెలిపారు.

శిథిలావస్థలో ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్

- తలుపులు, కిటికీలు చోరులపాలు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. నాలుగు దశాబ్దాల క్రితం ఎన్‌ఎస్‌పీ సిబ్బంది, అధికారులు ఉండేందుకు కార్యాలయాలు, క్వార్టర్స్ నిర్మించారు. నాడు దాదాపు రెండు వందల మందికి పైగా సిబ్బంది ఉండేవారు. నేడు వాడుకలో లేక పోవటంతో క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. దశాబ్దన్నర కాలంగా వాడుకలో లేకపోవటంతో చిట్టడవిని తలపిస్తుంది. కేవలం ఒక డీఈ కార్యాలయం మాత్రమే వాడుకలో ఉంది. అది కూడా శిథిలావస్థకు చేరడంతో వర్షం వస్తే కారుతుంది. ముండ్లమూరులో త్రిపురాంతకం క్వార్టర్స్ -1, ముండ్లమూరు క్వార్టర్స్ - 2 కింద అప్పట్లో నిర్మించారు. ముండ్లమూరు పరిధిలో 38 క్వార్టర్స్ ఉండగా, త్రిపురాంతకం పరిధిలో 22 క్వార్టర్స్ ఉన్నాయి. మోదేపల్లి మేజరు పరిధిలో సిబ్బంది, అధికారులు, త్రిపురాంతకం - 1 పరిధిలోని అధికారులు, సిబ్బంది ముండ్లమూరులో నివాసం ఉండేవారు. దశాబ్దన్నర క్రితం నుంచి సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయటం, వారి స్థానంలో కొత్త వారిని నియమించక పోవటంతో ఉన్న సిబ్బంది కూడా పట్టణాలకు వెళ్లిపోవడంతో క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ముండ్లమూరులో ఒక డీఈ, ముగ్గురు ఏఈలు, కొంతమంది లస్కర్లు మాత్రమే ఉన్నారు.



చిల్లచెట్ల మధ్య ఎన్‌ఎస్‌పీ ఏఈ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్

డీఈ కార్యాలయం తప్పా మిగతా కార్యాలయాలతో పాటు సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్స్ సైతం వాడుకలో లేక పోవటంతో నిరుపయోగంగా మారిపోయాయి. దీంతో చిల్లచెట్లు దట్టంగా పెరిగిపోయి విష సర్పాలకు నిలయంగా మారాయి.. వాడుకలో లేక పోవటంతో క్వార్టర్స్ కిటికీలు చోరీకి గురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చిల్ల చెట్లను తొలగించి కంచె ఏర్పాటుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం వెలిగండ్లలోని 50వ వార్డులో ఆయన పర్యటించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని చెప్పారు. ఇది మా ప్రభు త్వం, సుపరిపాలన అందించే మంచి ప్రభుత్వం అని ప్రజలు సంతోషంగా తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అరాచక పాలన సాగిందన్నారు. ప్రజలను అనేక విధాలుగా భయభ్రాంతులకు గురిచేశారన్నారు.



మహిళకు అందుతున్న ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికి తిరిగి వివరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శనివారం వెలిగండ్లలోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతి బూత్ పరిధిలో 50 కుటుంబాలను సందర్శించాలని దిశా నిర్దేశం చే శారు. నాయకులు సమిష్టిగా పాల్గొనాలని చెప్పారు. కుటుంబాల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలు తెలియజేయాలన్నారు. పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి

- ఎస్పీ దామోదర్

పామూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శనివారం సాయంత్రం పామూరు, సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లలోని రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. పామూరులో జరుగుతున్న పీర్ల పండుగ కార్యక్రమాల్లో ఎలాంటి గొడవలకు తావు ఇవ్వకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని సూచించారు. పామూరు స్టేషన్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఇక్కడ పెట్రోల్ బంకు ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని అడిగి తెలుసుకొన్నారు. స్టేషన్ ఆవరణలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని సీఐ ఎం.భీమా నాయక్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ఇంటెలిజెన్స్ సీఐ కేవీ రాఘవేంద్ర, కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, ఎస్ఐలు టి.కిశోర్‌బాబు ఎం.వెంకటేశ్వరనాయక్, తదితరులు పాల్గొన్నారు.



పామూరు స్టేషన్ ఆవరణలో ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

వెలిగండ్ల: వెలిగండ్ల పోలీసు స్టేషన్‌ను శనివారం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. లోన్ యాప్, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ఎస్పీ వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమా నాయక్ తదితరులు ఉన్నారు.

మెప్మా సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి

కనిగిరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మెప్మా సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం మెప్మా సిబ్బందికి ప్రభుత్వం ద్వారా వచ్చిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దిగువ మధ్య తరగతి కుటుంబాలను గుర్తించి వారికి స్వయం సహాయ రుణాలు అందించేలా కృషి చేయాలన్నారు. వినూత్న ఆలోచనలతో కుటీర పరిశ్రమలు, చిరు వ్యాపారాలు చేసుకునే విధంగా వారిని ప్రోత్సహించి రుణాలు మంజూరు చేయించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పొట్లూరి శ్రీహరి, సీవో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మెప్మా సిబ్బందికి పీడీ సమక్షంలో ట్యాబ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

కనిగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవా పథకంతో క్యాన్సర్ బాధితులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల భయభ్రాంతులకు గురికావొద్దని చెప్పారు. క్యాన్సర్ తొలి రెండు దశలో గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించే వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా ఉంటామన్నారు.

కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణలు దీప్తి పాల్గొన్నారు. 20 మందికి క్యాన్సర్ వైద్య పరిక్షలు నిర్వహించగా, వారిలో 9 మందికి వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.

వీరిలో నలుగురిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని హెచ్‌సీజీ ఎంఎన్‌ఆర్ క్యాన్సర్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు.

మొహర్రం వేడుకలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఎస్పీ ఏఆర్ దామోదర్

కనిగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్‌తో కలిసి శనివారం రాత్రి కనిగిరి, హెచ్‌ఎంపాడు పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మొహర్రంను పురస్కరించుకుని జరిగే ఊరేగింపు విధానాలను సీఐ ఖాజావలి ఎస్పీ, డీఎస్పీలకు వివరించారు. ఆదివారం వేకువజామున నాలుగు గంటలకే పీర్ల ఊరేగింపు పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా వంద మంది పోలీసులను నియమించినట్లు డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ ఎస్పీకి వివరించారు. వారిలో 30 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, పది మంది ఎస్ఐలు, ముగ్గురు సీఐలు, ఒక్కో పీరుకు ఒక ఎస్ఐను ప్రత్యేకంగా వెంట ఉంచేవిధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. గత 15 రోజుల్లో రెండుసార్లు ఇరువర్గాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఊరేగింపు ప్రారంభం నుంచి డ్రోన్ కెమెరాలతో పాటు ప్రత్యేక వీడియోగ్రాఫీలను సిద్ధం చేసినట్లు చెప్పారు.

అలాగే, తొలి ఏకాదశి ఆదివారం ఉదయం 5గంటల నుంచి పండుగ ఘడియలు రావటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. వేకువజాము 4 నుంచి 5గంటల వరకు ఉన్న గంట వ్యవధిలో పీర్ల ఊరేగింపు ఉత్సవంలో రోడ్డుపై పడిన పీర్లనుంచి పడిన ద్రవ్యాలను శుభ్రం చేయించే విధంగా చర్యలు వేగవంతంగా పూర్తి చేసేటట్లు మున్సిపాల్టీ సిబ్బందని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. 5 గంటల నుంచి మాత్రమే ఏకాదశి పండుగ సందర్భంగా దేవాలయాలకు వెళ్ళే విధంగా బఫర్ జోన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయాలు, మసీదుల వద్ద ప్రత్యేక బందోబస్తు నియమించినట్లు వివరించారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వేడుకలకు సంబంధించిన వివరాలను సమీక్షించటంతో పాటు సమాచారం వేగంగా పంపే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌కు సూచించారు.

ఊరేగింపునకు ముస్తాబైన పీర్లు

మొహర్రం సందర్భంగా ఒంగోలు బస్టాండులో దర్గాలో పీర్లు సుందరంగా అలంకరించారు. పట్టు వస్త్రాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న దర్గా నుంచి కొట్ల బజారు మీదుగా బొడ్డుచావిడి వైపు నుంచి పామూరు బస్టాండుకు చేరకుంటాయి. బొడ్డుచావిడి సెంటర్‌లో శంఖవరం పీర్లు సలాంలు తీసుకుంటాయి. అక్కడ నుంచి ఊరేగింపుగా పామూరు బస్టాండు మీదుగా పామూరు రోడ్డులోని పీర్ల బావి వద్దకు వెళ్తాయి. అనంతరం వాటిని ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి వాటిని శుభ్రం చేసి తిరిగి దర్గాకు తరలిస్తారు.



దర్గాలో సిద్ధంగా ఉన్న పీర్లు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, నాయకులు

సూపర్‌సిక్స్ పథకాల అమలుతో ప్రజల్లో ఆనందం

దర్శి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాల అమలుతో అన్నివర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు ప్రజాప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా ప్రజా స్పందన తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పథకాలు ఎలా అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎన్నో అద్భుతాలు సాధించిందని, ఎన్నో పరిశ్రమలను రాబట్టిందని పాపారావు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె.వెలిగొండారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు రామారావు, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన

దొనకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో విద్యాబోధన జరుగుతుందని సూపర్‌వైజర్ సుభాషిణి పేర్కొన్నారు. దొనకొండలోని వీవీపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే(ఈసీసీఈ) కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్లో చేర్పించాలన్నారు. ఈసందర్భంగా చేతితో తయారు చేసిన వస్తువులు, పిల్లలు గీసిన చిత్రాలను ప్రదర్శించారు.

తొలి ఏకాదశికి ముస్తాబైన శివాలయం

కురిచేడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినానికి కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయం ముస్తాబైంది. ఆదివారం తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి ఉదయాన్నే ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేం, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుబ్బారావు తెలిపారు. పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కంచర్ల రామయ్యకు నివాళి

దొనకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయులు, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత కంచర్ల రామయ్యకు టీడీపీ నాయకులు కామేపల్లి చెంచయ్య, తదితరులు నివాళులర్పించారు. కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం నిర్వహించిన రామయ్య దశదిన కర్మ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలవైపు తల్లిదండ్రుల చూపు

దొనకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలో మండలంలోని పోలేపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాలలో 20 మందికిపైగా విద్యార్థులు చేరారు. హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆదిమూలపు ప్రభుదాస్, ఉపాధ్యాయ సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో నేటివరకు దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పొందినట్లు సమాచారం.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



పూరిమెట్లలో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేస్తున్న కూరపాటి శ్రీనివాసరావు, కంచుమాటి శ్రీనివాసరావు

ముండ్లమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్6 పథకాలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే మూడు పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పూరిమెట్ల, భీమవరం గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఆర్థికంగా లోటులో ఉన్నా కూడా ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఇప్పటికే తల్లికి వందనం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటించి అమలు చేశారన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు.

రానున్న నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి పేదలకు సంక్షేమ ఫలాలు అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడిగం మస్తాన్‌రావు, ఒగులూరి నాగేశ్వరరావు, పూనాటి కృష్ణ, చింతపల్లి వెంకటస్వామి, సుంకర రాఘవరెడ్డి, చింతపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదఉల్లగల్లుకు 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరు

ముండ్లమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు గ్రామానికి నూతనంగా రూ.3.90 కోట్ల నిధులతో 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరైంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి సబ్‌స్టేషన్ ఆవశ్యకతను వివరించారు. మంత్రి వెంటనే ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం దర్శి ఈఈ పాలగిరి శ్రీనివాసులు, ఏడీఈ రవి కుమార్, ఏఈ అంకబాబు ఉల్లగల్లు వెళ్ళి సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

ముండ్లమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ఈఈ పాలగిరి శ్రీనివాసులు అన్నారు. వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతర విద్యుత్ అందజేయనున్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రం మండలంలోని ఈదర సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు.

ఈసందర్భంగా బొప్పూడివారిపాలెం వాసులు తమ గ్రామానికి పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం తలార్లపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. దీని వల్ల అంతరాయం ఏర్పడుతుందని, మండలంలోని ఈదర సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. బొప్పూడివారిపాలెంకు ఈదర సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్, ఏఈ అంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



గనులశాఖ సహాయ సంచాలకుడిగా రామచంద్రయ్య



బాపట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : గనుల శాఖ సహాయసంచాలకులుగా రామచంద్రయ్య బాధ్యతలు చేపట్టారు. శనివారం కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఆయనను సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

కలెక్టర్ వెంకటమురళికి మొక్క అందజేస్తున్న గనులశాఖ సహాయ సంచాలకులు రామచంద్రయ్య

బంగారు బాపట్ల

పీ-4 అమలులో రాష్ట్రంలోనే అగ్రభాగం

- కలెక్టర్ వెంకట మురళికి సీఎం ప్రత్యేక అభినందనలు
- మార్గదర్శకుల ఎంపికలో పక్కా ప్రణాళిక
- 72 శాతం బంగారు కుటుంబాల అనుసంధానం
- గుంటూరు, పల్నాడులో ముమ్మర కసరత్తు



సీఎం చంద్రబాబు నాయుడు మదిలో పుట్టిన మహత్తర ఆలోచన పీ-4. బంగారు కుటుంబాల ఎంపికతో పేదరిక నిర్మూలనకు ఆయన యుద్ధమే చేస్తున్నారు. సీఎం ఆలోచనలకు కలెక్టర్ పట్టుదల తోడవడంతో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ఈ పథకం అమలులో అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికే 72 శాతం బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం పూర్తి చేసి.. పక్కా ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ముందుకెళ్తోంది. ఇందుకు గాను కలెక్టర్ జె.వెంకట మురళి సీఎం ప్రశంసలు కూడా అందుకున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది ఏప్రిల్ 1న బాపట్ల జిల్లాలోని చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్ల పాలెంలో పించన్ల పంపిణీకి స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేశారు. అక్కడే వేదికపై ఇద్దరు మార్గదర్శకులను పరిచయం చేసి, గ్రామంలో కడు పేదరికంలో ఉన్న 33 బంగారు కుటుంబాలను వారికి అనుసంధానం చేశారు. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఓ వైపు బంగారు కుటుం బాల సర్వే చేపడుతూనే.. మార్గదర్శకుల ఎంపిక పై జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో అడుగులేసింది. రెండు వారాలకోసారి సమీక్షలు జరిపి.. పురోగతిని బేరీజు వేసుకుని ముందు కెళ్తున్నారు. దాని ఫలితమే నేడు పీ-4 అమలులో రాష్ట్రంలోనే జిల్లా అగ్రభాగాన నిలిచింది.



పీ4 అమలు సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

3,528 మంది మార్గదర్శకులు

బంగారు కుటుంబాల సర్వే బాపట్ల జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఓ కొలిక్కి వచ్చింది. కానీ, మార్గదర్శకుల ఎంపికే యంత్రాంగానికి సవాల్‌గా మారింది. బాపట్ల జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా అడుగులేసి 3,528 మార్గదర్శకులను పీ-4లో భాగంగా ఎంపిక చేసింది. వారి సామర్థ్యాన్ని బట్టి.. ఒకటి నుంచి పది బంగారు కుటుంబాలను అప్పగించడం జరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎంపికైన మార్గదర్శకుల సంఖ్య వెయ్యిలోపే ఉన్నట్లు సమాచారం. శుక్రవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బాపట్ల జిల్లాలో అనుసరించిన నమూనా పాటించాలని మిగతా జిల్లాలకు సూచించారు.

అందరి సహకారంతో..

మార్గదర్శకుల ఎంపికలో కార్పొరేట్ దిగ్గజాలపైనే ఆధారపడకుండా సేవాభావంతో పాటు సమాజానికి ఎంతో కొంత తిరిగివ్వాలనే దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లడంలో బాపట్ల జిల్లా యంత్రాంగం విజయవంతమైంది. గ్రామాల్లో ఉన్న ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంది. ఎన్‌జీవో ఆర్గనైజేషన్స్, వివిధ విభాగాల జిల్లా అధికారులు, స్తోమతను బట్టి ఒక్క బంగారు కుటుంబానికే సాయం చేస్తామని ముందుకొచ్చిన వారిని కూడా ఈ పీ4లో భాగస్వాములుగా చేశారు. సమాంతరంగా జిల్లాలో ఉన్న ఓ మోస్తరు కంపెనీల అధినేతలతో కూడా కలెక్టర్ వెంకటమురళి పలు సార్లు సమావేశమయ్యారు. సీఎస్ఆర్ కింద వారిని కూడా ఈ బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకునేలా చేశారు. ఇలా అన్ని వైపుల నుంచి చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగడం వల్లే 3,528 మార్గదర్శకులను ఎంపిక చేయగలిగి సీఎం మన్ననలందుకోగలిగారు.

మూడు జిల్లాల్లో బంగారు కుటుంబాలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 62,388 బంగారు కుటుంబాలను పీ4 కింద యంత్రాంగం ఎంపిక చేసింది. ఇందులో 44,920 కుటుంబాలను 3,528 మంది మార్గదర్శకులకు అనుసంధానం చేశారు. దీంతో 72 శాతం కుటుంబాలకు పీ4 అమలుకు మార్గం సుగమమైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 79 వేల పేద కుటుంబాలను జిల్లా యంత్రాంగం ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలో దాదాపు 58 వేల కుటుంబాలు పీ-4కు అర్హత సాధించాయి. ఈ రెండు జిల్లాల్లో మార్గదర్శకుల సంఖ్య తక్కువగా ఉండడంతో అనుసంధానం నెమ్మదిగా జరుగుతోంది. 40 శాతం బంగారు కుటుంబాల అనుసంధానం ప్రక్రియ పూర్తయింది.

కీలకంగా డీఆర్డీఏ విభాగం

పీ4 అమలు కోసం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి , క్రమం తప్పకుండా సమీక్షలు (మిగతా 8వ పేజీలో)

ఉపాధ్యాయులు, అధికారులు బదిలీల హడావుడిలో మునిగిపోయారు. ఈ ఏడాది పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం బడిబాట వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిర్వహించ లేదు. దీంతో సర్కారు బడుల్లో ప్రవేశాలు పూర్తిగా పడి పోయాయి. మరో వైపు తల్లికి వందనం పథకాన్ని కూడా ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు తమకు అనుకూలంగా మలుచు కున్నాయి. ఆ నగదునే ఫీజుగా చెల్లించి అడ్మిషన్లు పొందా లని సూచించడంతో.. తల్లిదండ్రులు అటువైపు మొగ్గారు. వందల సంఖ్యలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఈ ఏడాది చేర లేదంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

170 పాఠశాలలు జీరో అడ్మిషన్!



ప్రభుత్వ పాఠశాలల్లో పడిపోయిన ప్రవేశాలు

- బదిలీల హడావుడిలో
- ఉపాధ్యాయులు, విద్యాశాఖ
- 'బడిబాట' కూడా నిర్వహించని వైనం
- తల్లికి వందనం నగదే.. ప్రైవేట్ స్కూళ్ల ఫీజు
- పల్నాడు జిల్లాలో పరిస్థితి మరీ దారుణం
- వందల పాఠశాలల్లో అడుగుపెట్టని విద్యార్థులు



170 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు

పల్నాడు జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి. దాదాపు 170 పాఠశాలల్లో ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీనికి తోడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. పల్నాడు నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిపోయారు. కొత్త డీఎస్సీ ఫలితాలు వస్తేనే.. ఉపాధ్యాయుల భర్తీ జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

గుంటూరు, విద్య జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ ఆధ్వర్యంలో దాదాపు 900 వరకు పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 6.50 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు బదిలీల హడావుడిలో.. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంగతి విస్మరించారు. దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్న ప్రైవేట్ యాజమాన్యాలు.. భారీ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తమ వైపునకు ఆకర్షించాయి. దీంతో సర్కారు పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ కార్యక్రమాలు ఏవి?

ప్రభుత్వ (మిగతా 8వ పేజీలో)

మళ్లీ ఆర్‌వోబీ ఆశలు

మరోమారు నిధులు మంజూరుకు ప్రయత్నాలు

గతంలో బ్రిడ్జి రద్దుపై ప్రజల్లో ఆందోళన

చీరాల, జూలై 5 : చీరాల పట్టణ పరిధిలో వైకుంఠపురం రైలు గేటు వద్ద నిర్మించనున్న ఆర్‌వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) రద్దు కావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పట్టణం నుంచి రైలుగేటు అవతలి ప్రాంతాలకు చెందిన వైకుంఠపురం, విఠల్‌నగర్, ప్రకాష్‌నగర్, ఎంజీసీ కాలనీ, దండుబాట రోడ్డు, జవహర్‌నగర్ ప్రాంతాలకు చెందిన వేల సంఖ్యలో ప్రజలు, వాహనదారులు వివిధ వృత్తి, ఉపాధి, విద్య, వైద్యం కోసం పట్టణానికి వస్తుంటారు. నిత్యం రాకపోకలు సాగించే రైలు ప్రయాణాలతో గంటల తరబడి గేట్లు వేస్తుండటంతో ప్రజలు నానా యాతన పడుతుంటారు.



వైకుంఠపురం రైల్వే గేటు

ఆర్‌వోబీతో చిగురించిన ఆశలు

ప్రజా సమస్యలపై దృష్టి సారించిన గత పాలకులు వైకుంఠపురం వద్ద ఆర్‌వోబీ వంతెన నిర్మించేందుకు ప్రయత్నాలు సాగించారు. ఈక్రమంలోనే అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఎవరో ఒకరు దీనిపై మల్లగుల్లాలు పడుతూనే వచ్చారు. సుమారు 800 మీటర్లు పొడవుతో రూ. 50 కోట్లు అంచనాలతో 2017- 18లో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, 2022లో సేతుబంధన్ ద్వారా రూ.55 కోట్లు నిధులు కూడా మంజూరు జరిగాయి.

అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కు

అయితే రోజులు గడుస్తున్న కొద్దీ అధికారులు ఆర్‌వోబీపై నిర్లక్ష్యం వహించారు. దీంతో సైట్‌ప్లాన్, డ్రాయింగ్, డీపీఆర్‌లు పూర్తయ్యి టెండర్‌లు పిలిచే దశలో ఉండగా కొన్ని అనివార్య కారణాలతో 2024 అక్టోబర్ 16న ఆర్వోబీని రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు ఎంతోకొంత చొరవ అందిపుచ్చుకుని చిన్నపాటి పనులైన చేసి ప్రారంభించినట్లయితే ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు జరిగే పరిస్థితి ఉండేది కాదు. ఫలితంగా ప్రస్తుతం ప్రజలు తీవ్ర అసహనంతో గడుపుతున్నారు.

తిరిగి నిధులు మంజూరుకు ప్రయత్నాలు

అయితే విషయం తెలుసుకున్న ప్రస్తుత పాలకులు యథాస్థానంలోనే ఆర్‌వోబీని మంజూరు చేయించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే ఈ సారైనా నిర్మాణం జరగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

లోక్ అదాలత్ రికార్డు

- ఉమ్మడి జిల్లాలో 10,734 కేసుల పరిష్కారం
- విలువ రూ.50.96 కోట్లు

గుంటూరు,(లీగల్) జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో శనివారం అన్ని కోర్టుల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 10, 734 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తెలిపారు. వీటి లో సివిల్ కేసుల 1077, క్రిమినల్ కేసులు 9580, ప్రీ -లిటిగేషన్ కేసులు 77 ఉండగా ఈ పరిష్కారమైన కేసుల విలువ మొత్తం రూ. 50,96,79,914 గా పేర్కొన్నా రు. జిల్లా న్యాయశాఖ చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన లోక్ అదా లత్ లలో ఇంత పెద్ద మొత్తంలో కేసులు పరిష్కారం కావడం ఇదే మొదటి సారి అని హర్షం వ్యక్తం చేశారు. వాహన ప్రమాదాలకు సంబంధించిన మూడు పెద్ద కేసుల్లో బాధితులకు రూ.3.20 కోట్లు అందినట్టు తెలిపారు. ఈ లోక్ అదాలత్ విజయవంతానికి సహ కరించిన కక్షిదారులు, పోలీస్, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



బాధితులకు నగదు చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి చిత్రంలో ఎమ్మెల్యేలు వేగేశన, ఆనందబాబు

జిల్లా జీడీపీలో ఏటా 15శాతం

వృద్ధిరేటు కనిపించాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

బాపట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా జీడీపీలో ఏటా 15 శాతం వృద్ధిరేటు పెరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. బాపట్ల జిల్లా విజన్‌యాక్షన్ ప్లాన్‌పై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షకు ఆయన వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలంటే అందుబాటులో ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బాపట్ల జిల్లా జీడీపీలో 20వ స్థానంలో నిలిచిందని తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఉద్యాన పంటలలో కొత్తరకాలను ప్రోత్సహించడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పామాయిల్ సాగుపై రైతులు దృష్టిసారించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బ్లాక్ బర్లి పొగాకు రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు.

తలసరి ఆదాయం పెంపే లక్ష్యం

ప్రజల తలసరి ఆదాయం పెంచటమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళుతున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం రూ.2.19 లక్షలు కాగా ఏడాదికి 15శాతం పెంచేలా ప్రణాళిక రూపొందించామన్నారు. 2028-29 సంవత్సరానికి జిల్లా తలసరి ఆదాయం రూ.5.42 లక్షలు సాధించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. గడిచిన ఏడాదిలో జిల్లాలో వస్తువుల అంతిమ ఉత్పత్తి విలువ రూ.20,163 కోట్లు కాగా.. 2028-29కి రూ.38,165 కోట్లకు పెరగాలని సూచించారు. పీ-4 కుటుంబాలకు మార్గదర్శకులను అనుసంధానించే ప్రక్రియ ఇప్పటికే 72శాతం పూర్తయిందని చెప్పారు. ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఎం.మాలకొండయ్య పీ-4 విధానం, బాపట్ల అభివృద్ధికి తమ అభిప్రాయాలను తెలిపారు. సీపీఓ షాలెమ్ రాజు, జిల్లా అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

భూ ధారాదత్తంపై యరపతినేని లేఖాస్త్రం



- తుమ్మల చెరువు టోల్ ప్లాజా

- రూ.2 కోట్ల విలువైన భూమి కారుచౌకగా ధారాదత్తం
- నామ్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేటాయిస్తూ గత ప్రభుత్వం జీఓ
- వైసీపీ ఎంపీ అడిగారని జడ్పీకి తెలియకుండానే బదలాయింపు
- జీఓ రద్దు చేయాలని ఎమ్మెల్యే యరపతినేని ప్రభుత్వానికి లేఖ





గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ నేతల భూ ఆక్రమణలు ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా వైసీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి చొరవతో రూ.2 కోట్ల విలువైన జడ్పీ స్థలాన్ని నామ్ (నార్కెట్ పల్లి - అద్దంకి - మేదరమెట్ల) ఎక్స్ ప్రెస్‌వేకు కట్టబెడుతూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అసలు విషయంలోకి వెళితే.. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు చెట్టు సమీపంలో నామ్ ఎక్స్‌ప్రెస్‌వేకి చెందిన టోల్ ప్లాజా ఉంది. ఇక్కడ సర్వే నంబరు 251లో జిల్లా పరిషత్‌కు చెందిన భూమిలో టోల్ ప్లాజాకు చెందిన షెడ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 2.71 ఎకరాల భూమికి 2013 నుంచి అద్దె చెల్లిస్తూ వచ్చారు. 2018 తరవాత అద్దె చెల్లింపులు ఒక్కసారిగా నిలిపివేశారు. జడ్పీ అధికారులు ఎన్ని లేఖలు రాసినా నామ్ ఎక్స్‌ప్రెస్ వే యాజమాన్యం స్పందించలేదు. సు మారు రూ.12.64 లక్షల అద్దె బకాయి ఉన్నట్లు చెబుతున్నారు.

అధికారం అడ్డం పెట్టుకొని...

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామ్ ఎక్స్‌ప్రెస్ వే సంస్థ ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లు పైనే ఉన్న జడ్పీ భూమిని కారుచౌక దరకు తీసుకునేందుకు ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. హక్కుదారుగా జడ్పీని పూర్తిగా పక్కన పెట్టేసి ఆర్అండ్‌బీ శాఖను లైన్‌లోకి తెచ్చారు. 2023 మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.9.50 లక్షలు చెల్లించే విధంగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. దీంతో వైసీపీ ప్రభుత్వం జడ్పీ భూమిని నామ్ వే ఎక్స్‌ప్రెస్‌కు కేటాయిస్తూ జీవో నంబరు 76 ను 2023 ఫిబ్రవరి 21న జారీ చేసింది.

నిబంధనలకు నీళ్లు

ఏదైనా ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు బదలాయించాలంటే.. హక్కుదారుగా ఉన్న ప్రభుత్వ శాఖ అనుమతి తీసుకోవాలి. ఒక వేళ భూమి విలువ రూ.2 లక్షలు పైన ఉంటే రాష్ట్ర మంత్రి మండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని జీఓ నంబరు 323 చెబుతోంది. తుమ్మల చెరువు భూమి వ్యవహారంలో అటువంటిది ఏమీ జరగలేదు. అయోధ్య రామిరెడ్డి అడిగారు.. రాసి ఇచ్చేశారు అన్నట్లుగా తంతు జరిగిపోయింది.

2024 లో వెలుగులోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తుమ్మల చెరువు భూమిపై చర్చ జరిగింది. గత సెప్టెంబరులో జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో పిడుగురాళ్ల జడ్పీటీసీ సభ్యుడు జంగా కోటయ్య ఈ విషయం లేవనెత్తారు. అంతకు ముందు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఎంపీ అయోధ్య రామిరెడ్డి చేసిన అడ్డగోలు భూదందాను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. జడ్పీ అనుమతి లేకుండా నే జారీ అయిన జీవోను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాయడం హాట్ టాపిక్ గా మారింది.

యరపతినేని లేఖ

తుమ్మల చెరువు భూమి వ్యవహారంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సీరియస్‌గా దృష్టి సారించారు. జడ్పీ స్థలాన్ని బదలాయిస్తూ..తీసుకొచ్చిన జీవో నంబరు 76 రద్దు కోసం ఆయన ప్రభుత్వానికి లేఖ రాసినట్లుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇటు జడ్పీ పాలక వర్గం కూడా ఈ విషయంలో సీరియస్‌గా ఉంది. శుక్రవారం జరిగిన సమావేశంలో కూడా ఈ విషయాన్ని అజెండాలో చేర్చారు.

అవీ..ఇవీ..

కొత్త అంశాలపై దృష్టిసారిస్తే అభివృద్ధి సాధ్యం

● పొగడదండ రవికుమార్



అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందిస్తున్న రవికుమార్

చీరాల, జూలై 5 : ప్రతి విద్యార్థి కొత్త అంశాలపై దృష్టిసారిస్తే వ్యక్తిగత అభివృద్ధి సాధ్యమని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ డా.పొగడదండ రవికుమార్ పేర్కొన్నారు. యలమంచిలి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సీఈవో యలమంచిలి రామకృష్ణ సహకారంతో ఇటీవల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్స్ కోర్సులలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రధానోత్సవం ఆయన ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్(డిప్లమా) కళాశాల ప్రిన్సిపల్ డా.రాధాకుమారి, జనరల్ మేనేజర్ పట్టాభి దానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రేడ్, తేమ విషయంలో నిబంధనలు పాటించాలి

పంగులూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో పొగాకు విక్రయించే రైతులు గ్రేడ్‌లతో పాటు తేమ విషయంలో నిబంధనలు విధిగా పాటించాలని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో నల్ల బర్లీపొగాకు కొనుగోలును ఏవో సుబ్బారెడ్డి శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి పొగాకు చెక్కులు తీసుకువచ్చే ముందు రైతులు గ్రేడింగ్, తేమశాతం, చెక్కుపై పట్టల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తేమ 20 శాతం మించకుండా చూడాలన్నారు. నిబంధనలు పాటించి రైతులు కొనుగోలు అధికారులకు సహకరించాలని ఏవో సుబ్బారెడ్డి కోరారు. కొనుగోలు కేంద్రం పరిశీలనలో పీఏసీఎస్ సీఈవో రావూరి లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గోవాడలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

అద్దంకి, జూలై5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం టీడీపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాకినేని ఏడుకొండలు, పుట్టా సాంబశివరావు, వీరరాఘవులు, కోంద్రు కిషోర్, శింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్స్ అందజేత



భోజన ప్లేట్స్ అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల, జూలై 5 : పట్టణంలోని ఎస్ఆర్అండ్ పీఎం హైస్కూల్ విద్యార్థులకు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.27 వేల విలువైన 300 భోజన ప్లేట్స్ అందించారు. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో బోధన అందుతుందని ఉన్నతంగా చదివి, ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజు అసోసియేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, సురేష్, మురళీకృష్ణ, కృష్ణ, ప్రతాప్, డా.బాబురావు, రమేష్, వెంకటేశ్వరరెడ్డి, సురేష్, జయచంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1873 కేసులు పరిష్కారం

అద్దంకి,జూలై5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక కోర్టు భవనాల సముదాయంలో రెండు బెంచులు ఏర్పాటు చేసి మొత్తం 1873 కేసులు పరిష్కారించారు. మొదటి బెంచులో సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, సభ్యులుగా న్యాయవాదులు సత్యవతి, మహ్మద్‌రఫీలు, రెండవ బెంచుల్లో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అఖిల, సభ్యులుగా హై గ్రీవాచారి, మార్తా శ్రీను ఉన్నారు.

పర్చూరులో 392 కేసులు పరిష్కారం

పర్చూరు : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారిణి కె.ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అధాలత్‌లో 392 కేసులు పరిష్కరించినట్లు కోర్టు కార్యాలయం సిబ్బంది తెలిపారు. అందులో 17 సివిల్ కేసులు కాగా, 85 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అదేవిధంగా 287 పెట్టీకేసులు, 01 మనోవర్తి, ప్రి-లిటికేషన్ కేసులు 02 కేసును రాజీమార్గం ద్వారా పరిష్కరించటం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో లోక్ అధాలత్ బెంచ్ సభ్యులుగా పి.జాన్‌బాబు, కట్టా సాల్మన్, సిహెచ్.రమణి, కె.ధనలక్ష్మి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లో మోటారు దొంగ అరెస్ట్

● ఐదు మోటార్లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఎస్సై జనార్ధన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై జనార్ధన్

వేటపాలెం (చీరాల), జూలై 5 : పొలాల్లో రైతులు వినియోగించుకునే మోటార్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని వేటపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం జగనన్న కాలనీకి చెందిన నాసిర్ వలి అలి యాస్ షన్ను వ్యసనాలకు బానిసగా మారి చోరీలకు పాల్పడి జల్సాలు సాగిస్తున్నాడు. దీంతో రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై జనార్ధన్ నాసిర్‌వలిని శనివారం అరెస్ట్ చేసి ఆయన వద్ద రూ.1.10 లక్షలు విలువైన ఐదు విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

సమాజంలో నిత్య చైతన్య స్ఫూర్తి భరద్వాజ

పంగులూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి):తన నవలా రచనల ద్వారా సమాజంలో చైతన్య స్ఫూర్తిని నింపిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ చిరస్మరణీయుడని విశ్వబ్రాహ్మణ సంఘ యువజన నాయకులు మోగంటి అనిల్ అన్నారు. డాక్టర్ రావూఇ భరద్వాజ జయంతి వేడుక పంగులూరు విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ భరద్వాజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సాంబశివరావు, కోటపాటి శ్రీనివాసరావు, వ్యవస్థాపక అధ్యక్షులు రవిచంద్రాచారి, మచ్చా రమేష్‌బాబు, కందుకూరి మల్లికార్జునరావు, నరేష్‌అవినాష్ పాల్గొన్నారు.


నేడు మార్టూరులో ఉచిత వైద్యశిబిరం

మార్టూరు, జూలై5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బైండ్ల కులస్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మార్టూరులోని జడ్పీ హైస్కూల్‌లో కాటూరి మెడికల్ కళాశాల, వైద్యశాల వారితో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు కమిటి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి కార్డియాలజీ, గైనకాలజిస్ట్, న్యూరాలజీ, ఈఎన్‌టి తదితర విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు రామకూరు తిరునాళ్ల

● దర్శనం కోసం వేలాదిగా తరలిరానున్న భక్తులు ● అన్నదానానికి భారీగా ఏర్పాట్లు

పంగులూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు గ్రామ కొండపై కొలువుదీరిన బాలత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి వారి సన్నిధిలో ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా తిరునాళ్ల ఘనంగా నిర్వహించనున్నారు. తొలిఏకాదశి సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు రామకూరు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. వేకువజాము నుంచే గిరి ప్రదక్షణ చేసేందుకు తరలివచ్చే భక్తులకోసం అల్పాహారం, ప్రత్యేక పూజా కైంకర్యాలు, స్వామివారి దర్శనం కోసం భక్తులకు పెద్దఎత్తున అన్న సంతర్పణ కోసం ఆలయకమిటీ గ్రామస్థుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం వేళ భక్తుల వినోదం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.






రామలింగేశ్వరస్వామి, బాలత్రిపురసందరి అమ్మవారు

ఆలయం శిథిలావస్థకు చేరుకుంటుందన్న సమయంలో గ్రామపెద్దలు పూనుకుని ప్రభుత్వం, భక్తుల సాయంతో రూ.4 కోట్ల వ్యయంతో ఆలయాన్ని ఆధునీకీకరిస్తున్నారు. ఇటీవల ఆలయానికి కుడివైపున రూ.20 లక్షల నిధులు వెచ్చించి మండపం నిర్మాణం చేపట్టారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు కొండపై ఆలయానికి చేరుకునేందుకు మెట్లమార్గంతో పాటు ఘాట్ రోడ్డు నిర్మించారు. స్వామివారి కైంకర్య సేవల నీటి కోసం సహజసిద్ధంగా ఏర్పడిన కోనేరులు కలిగి ఉండటం విశేషం. ఎంతో విశిష్టత కలిగి ఉన్న ఈ ఆలయంలోని స్వామివారి సన్నిధిలో ఏటా తొలిఏకాదశి పర్వదినాన వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచి రాత్రి సమ యం వరకు స్వామివారిని దర్శించుకుంటారు.



రామకూరు కొండపై రూ.4 కోట్ల వ్యయంతో పునర్నిర్మిస్తున్న రామలింగేశ్వరస్వామి ఆలయం



కొండపై సహజసిద్ధంగా ఏర్పడిన కోనేరు

ఉచిత బస్సు సేవల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

చీరాల, జూలై 5 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రతిష్టాత్మకంగా ఉచితబస్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చీరాల ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించారు. డిపో ప్రాంగణంలోని పారిశుద్యం, మరుగుదొడ్లతో పాటు ప్రయాణికులకు అందించే సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛభారత్, స్వర్ణాంధ్ర అమలుతీరు తెన్నులు నిశితంగా పరిశీలించి నట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు ఉచితబస్సు సౌకర్యాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సర్వీసులతో పాటు ఏ మేరకు నూతన సౌకర్యాలు అవసరమున్నదో అంచనాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని బస్సుల ఆధునీకరణతో పాటు విద్యుత్, బ్యాటరీ సర్వీసు బస్సులను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. అలాగే అవసరం మేరకు సిబ్బందిని నియమించేందుకు ప్రాథమిక దశలో ఉన్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి ఈనెల 8న బోర్డు మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. తద్వారా ప్రజలు సమస్యలను చెప్పుకోవచ్చని అన్నారు. ప్రయాణికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్గో సర్వీసులు ఆర్టీసీకి అత్యంత ఆదాయమని, అయితే సేవలు అందిస్తున్న సిబ్బంది ప్రజలతో మర్యాదగా మెలగాలని సూచించారు. చైర్మన్ వెంట డీఎం శ్యామల, బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణ, భరణి, అరవపల్లి కుమార్, చంద్ర, తదితర ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

వైసీపీ వైఫల్యం ఆర్టీసీకి శాపం

గత ప్రభుత్వం ఆర్టీసీ విధివిధానాలపై అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు చైర్మన్ సురేష్‌రెడ్డి అన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లపై అడ్డగోలుగా బస్‌సర్వీసులు నిర్వహించినట్లు చెప్పారు. అందువలన సుమారు 15 లక్షల కిలోమీటర్లు తిరగాల్సిన బస్సులు 10 లక్షల కిలోమీటర్లుకే మూలన పడుతున్నట్లు చెప్పారు. ఆ సమస్యలు పరిష్కరించి సేవలు అందించాల్సిన పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఉందని, గత ప్రభుత్వ దౌర్భాగ్య చర్యలు అత్యంత పాశవికంగా ఉన్నట్లు చెప్పారు.



ప్రయాణికుల సమస్యలపై ఆరా తీస్తున్న నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

సెయింట్ ఆన్స్ విద్యార్థినికి బంగారు పతకం

గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న ఫర్జానా



బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థిని ఫర్జానా

చీరాల, జూలై 5 : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థిని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ఇటీవల జేఎన్‌టీయూకే కాకినాడ యూనివర్సిటీలో జరిగిన 2020 - 24 బీటెక్ పరీక్షల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థిని ఎస్‌కే.ఫర్హానా పాల్గొని యూనివర్సిటీ స్థాయిలో ప్రథమస్థానం దక్కించుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఫర్జానా 155 కళాశాలలకు చెందిన విద్యార్థులతో పోటీపడి బంగారు పతకం సాధించారు. గవర్నర్ చేతుల మీదుగా మెడల్ సాధించడంతో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డా.జగదీష్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు

అద్దంకి,జూలై5(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏఐఐఈఏ 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ జాయింట్ సెక్రటరీ రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పారా.శ్రీనివాసరావు, అద్దంకి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మాధవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

కారంచేడు(పర్చూరు), జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా సాగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మొదట నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లపై చర్చసాగింది. ఒక వర్గానికి చెందిన రైతుల పొగాకును మాత్రమే అధికారపార్టీ కొనుగోలు చేస్తోందని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆరోపించారు. వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేయడం హర్షించతగ్గ విషయం అన్నారు. కొనుగోలు జరగక అవస్థలు పడుతున్న పొగాకు రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేవిధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషిని చేతులెత్తి నమస్కరించాల్సిన విషయం అన్నారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాన్ని కొంతమంది తూట్లు పొడిచే విధంగా చేస్తున్నారన్నారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పనుల్లో పనికి హాజరు కానివారికి హాజరు వేసి నగదు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఆయా, ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాసుబాబు

వసతిగృహ నిర్మాణాల పరిశీలన

బల్లికురవ. జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులతో వసతి గదుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయిస్తామని సమగ్రశిక్ష జిల్లా ఈఈ నాగజ్యోతి తెలిపారు. బల్లికురవలో ఉన్న కేజీబీవీ విద్యాలయంలో రూ.1.64 కోట్లతో ఆరు వసతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ గదులు శ్లాబు శనివారం వేయగా ఈఈ నాగజ్యోతి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతు నాణ్యత ప్రమాణాల మేరకు వసతి గదులను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ పరిశీలనలో ఏఈ రాజన్‌బాబు, ఎంఈవో రమేష్, కాంట్రాక్టర్ రాంబాబు, టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ సరళ కుమారి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు భార్గవ్, రఫీ పాల్గొన్నారు.



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ నాగజ్యోతి

వృద్ధుని దాతృత్వం వెలకట్టలేనిది

ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పర్చూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) :ఆర్థిక స్తోమత లేకపోయినా, నిరుపేద విద్యార్థులకు తోడ్పాడు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు సమకూరుస్తున్న చిమటా వెంకటేశ్వర్లు స్ఫూర్తి అభినందనీయని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం మోదుగుల నాగిరెడ్డి అన్నారు. శనివారం నూతలపాడు గ్రామానికి చెందిన చిమటా వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో సమకూర్చిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు విద్యద్వారానే సమాజ అభివృద్ధి అన్న సంకల్పంతో చిమటా చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బొప్పూడి భాను ప్రసాద్ మోడల్ సూల్ హెచ్ఎం.పాలపర్తి నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

సంతమాగులూరు జులై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలోని క్రికెట్ టీంకు సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్ శనివారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ సిపాయి బాజీ మసూద్, చెన్నుపల్లి నాగూర్, కాలేషా గారి బుజ్జి, ఎం ఖాదర్ మస్తాన్, బి ఏడుకొండలు, ఎం ఖాదర్ భాష, క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై మహిళలకు అవగాహన కలిగించండి

మార్టూరు, జూలై5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ఆదాపై మహిళలకు అవగాహన కల్పించాలని ఎఫ్‌టీవో ఏపీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఎం సురేంద్రబాబు, మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీలు, అకౌంట్ వీవోఏ లు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

● సమాచారం అందుకొని రక్షించిన పోలీసులు

వేటపాలెం(చీరాల), జూలై 5 : భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు యత్నించిన ఘటన శనివారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం కోనేటి నగర్‌లో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పొట్లూరి నందిని, గణపతి దంపతులు. వీరికి ఇరువురు సంతానం. అయితే ఇటీవల గణపతి మద్యానికి బానిసగా మారి, భార్యను వేధిస్తుండడంతో గ్రామ శివారలోని కాలువలో పడి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో స్థానికులు వేటపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జనార్ధన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను రక్షించారు. అలాగే దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

● వైసీపీ బాపట్ల జిల్లా పరిశీలకులు తూమాటి మాదవరావు



క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాదవరావు

చీరాల, జూలై 5 : రాష్ట్రంలో కూటమి మాటలు ప్రజలు గ్రహించారని, సూపర్ సిక్స్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని జిల్లా పరిశీలకులు, ఎంఎల్సీ తూమాటి మాధవరావు, జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చీరాల నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపు కార్యాలయంలో 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ మాటల్లో నిలకడ లేదన్నారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉండగా కొంత తడబడినది వాస్తవమే నన్నారు. ఈసారి కచ్చితంగా నిలబడతామని చెప్పారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ క్యూఆర్‌కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

170 పాఠశాలలు.. జీరో అడ్మిషన్!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఏటా విద్యాశాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పాఠశాలలు ప్రారంభించడానికి పది రోజుల ముందే బడిబాట పేరుతో తల్లిదండ్రులని ఉపాధ్యాయులు కలిసి.. అడ్మిషన్ల కోసం తమ వంతు కృషి చేసేవారు. ఈ ఏడాది బదిలీల షెడ్యూల్ కారణంగా అనేకమంది ఉపాధ్యాయులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కూడా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించ లేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు భారీగా తగ్గిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తల్లికి వందనం నగదే..ప్రైవేట్ స్కూళ్ల ఫీజు..

ప్రైవేట్ పాఠశాలల పీఆర్వోలు(ప్రజా సంబంధాల అధికారులు) గ్రామ స్థాయికి చేరి విద్యార్థులను తమ స్కూళ్లలో చేర్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు కూడా బస్సులను, ఆటోలను పంపించి విద్యార్థులను తరలిస్తున్నారు. ఫీజులు కూడా మొదట్లోనే.. పెద్ద మొత్తంలో వసూలు చేయకుండా ప్రభుత్వమిచ్చిన తల్లికి వందనం డబ్బులను మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆ నగదును ప్రైవేటు పాఠశాలలకు చెల్లించి.. తమ పిల్లల్ని అక్కడ చేర్పిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ స్పందించకుంటే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శాంతికల్యాణం

అద్దంకి, జూలై5(ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం శాంతికల్యాణం నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని శాంతికల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

'బంగారు' బాపట్ల !

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. ఇందులో డీఆర్డీఏ విభాగం కీలకంగా పనిచేస్తోంది. మార్గదర్శకుల ద్వారా కేవలం ఆర్థిక సాయం మీదే దృష్టి పెట్టకుండా కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, బ్యాంకుల ద్వారా రుణాలను వీలైనన్నీ ఎక్కువ మార్గాల ద్వారా బంగారు కుటుంబాలకు చేయూత అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఎక్కువగా డీఆర్డీఏ విభాగంతో అనుసంధానమై ఉన్నాయి. దీంతో అర్హత ఉన్న పేద కుటుంబాలకు తొలుత సంక్షేమం పక్కాగా అందించడానికి యంత్రాంగం ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా అధికారి మొదలుకుని మండల స్థాయిలోని డీఆర్డీఏ యంత్రాంగాన్ని పీ-4లో భాగస్వాములుగా చేశారు.

అమలులో అప్రమత్తంగా ఉండాలి

నిరుపేదల మేలు కోసమే పీ-4ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్నవారు కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించడమో.. స్థానికంగా ఉండే అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల ద్వారా పీ4 ద్వారా ఆయాచిత లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈ ఫలాలు అర్హులకే అందాలంటే.. బంగారు కుటుంబాల ఎంపికలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్

చీరాల, జూలై 5 : ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్‌వ్యాధి టీకాలు అందిస్తున్నట్లు సంబధిత అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ఉదయం 9 గంటల నుంచి స్థానిక పశువైద్యశాలలో సంప్రదించి యజమానులు వ్యాక్సిన్ వినియోగించుకోవచ్చని తెలిపారు. లేని యెడల కుక్కల నుంచి మనుషులకు రేబిస్, ఆంత్రాక్స్, క్షయ, ఏవీఎస్ ఇంఫ్లూయంజా తదితర వ్యాదులు సంక్రమిస్తాయని అధికారులు తెలిపారు.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు



రంగనాయక స్వామి దేవాలయం

అద్దంకి, జూలై5 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి పండుగ సందర్భంగా అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలోని రంగనాయక స్వామి దేవాలయం, పాత దామావారిపాలెంలోని నరసింహ స్వామి దేవాలయాలతో పాటు పలు దేవాలయాలలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లను దేవాలయ అధికారులు, పూజారులు పర్యవేక్షించారు.

మాలకొండ ఆదాయం రూ. 10,24,526

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుంచి రూ.10,24, 526 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ.5,850, కుంకుమార్చన రూ.20,600, తలనీలాలు రూ. 43,100, వాహనపూజలు రూ. 4,820, ప్రత్యేకదర్శనం రూ. 2,85,200, స్థలపు రాణం పుస్తకాల విక్రయం రూ. 680, రూము అద్దెలు రూ. 34,620, కవర్లు రూ. 6 వేలు, లడ్డుప్రసాదం రూ.2,07,085, అన్నదానం రూ.4,06,511, విరాళాలు రూ.10 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

అద్భుతాల అరణ్యం

పెనుశిల అభయారణ్యం.. వన్యప్రాణుల నిలయం



పెద్దపులుల గాండ్రింపులు.. చిరుతల ఓరచూపులు... తోడేళ్లు, నక్కల దోబూచులాటలు, పాముల కొట్టే బుసలతోపాటు అనేక రకాల జంతువుల అరుపులు, పక్షుల కిలకిలరావాలు, నెమళ్ల నృత్యం శ్రీ పెనుశిల నృసింహ అభయారణ్యం సొంతం. అంతే కాదండోయ్.. ఎన్నో ఔషధ మొక్కలు కూడా ఈ అటవీ ప్రాంతంలో ఉన్నాయి. నెల్లూరు, కడప జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ అటవీ ప్రాంతంలో భారీ వృక్ష సంపద, లోయలు, గుట్టలు దర్శనమిస్తాయి. వర్షాకాలంలో ఎత్తయిన కొండల్లో నుంచి పాలవెల్లువలా కిందకు జాలువారే జలపాతం ఈ అటవీప్రాంతం సొంతం.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

నెల్లూరు, కడప జిల్లాల పరిధిలో 1,03,085.773 హైక్టార్ల విస్తీర్ణంలో శ్రీ పెనుశిల నృసింహ అభయారణ్యం ఉన్నది. ఈ రెండు జిల్లాల పరిధిలోని గోపవరం, అట్లూరు, పోనగలూరు, చిట్వేల్, కలువాయి, అనంతసాగరం, రాపూరు మండలాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో సుమారు 40,443. 27 వేల హైక్టార్లలో అభయారణ్యం ఉంది. ఇందులో రాపూరు రేంజ్ 23,296.39 హైక్టార్లు, కండలేరు రిజర్వాయర్ ప్రాంతం 12,600 హైక్టార్లు, వెలుగొండ, ఆత్మకూరు ప్రాంతాల్లో కలుపుకొని 4546.875 హైక్టార్లు ఉంది. ఇక కడప జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు, రాజంపేట, కడప పరిధిలో 62,642.503 హైక్టార్ల అభయారణ్యం ఉన్నది.



● ఎన్నో రకాల ప్రాణులకు నెలవుగా...

సామన్యులు ఇప్పటివరకు చూడని అనేక రకాల వన్యప్రాణులు ఈ అభయారణ్యంలో ఉన్నాయి. పెద్దపులులు, చిరుతలు, జంగిల్ క్యాట్, ఫిషింగ్‌క్యాట్, లేపర్డ్‌క్యాట్, గిద్దలు, తోడు నక్కలు, అడవి పంది, చంద్రబొక్కె, సామ్బర్ జింక, ముషిక జింక, స్లెండర్ లోరిస్, కృష్ణజింక, నాలుగు కొమ్ముల జింక, పొంగోలిన్, ఎలుగు బంటలు, పెద్ద ఎలుకలు, నక్కలు, కోతులు, చింపాజీలు, కొండముచ్చులు, పాములు, తాబేళ్లు, ముళ్ల పందులు, దున్నలు, నెమళ్లతోపాటు అనేక రకాల పక్షలు ఈ అటవీప్రాంతంలో ఉన్నాయి. ఇటీవల పెద్ద పులుల జాడలు ఎక్కువగా కనిపిస్తుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టైగర్ కారిడార్ ఏర్పాటుకు అనుమతించాయి.





● ఔషధ వృక్ష సంపద

అభయారణ్యంలో వన్యప్రాణులతోపాటు వేలాది రకాల వృక్ష సంపద ఉంది. ప్రధానంగా టెర్మినేలియా టొమెంటోసా, అనోగైసస్ లాటిపోలియా,మిత్రగైనా పర్విఫ్లోరా, మాధూక ఇండికా, పీటర్‌కార్పస్ మార్సుపియమ్, హార్డ్వి



● లక్ష్మీనృసింహుడి ఆలయం

అభయారణ్యం మధ్యలో దాదాపు 200 ఎకరాల్లో శ్రీ పెనుసిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉన్నది. 1891లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తించే సమయంలోనే ఈ దేవస్థానానికి 200 ఎకరాలను కేటాయించారు. ప్రకృతి సోయగాల మధ్యలో సుందరమైన వనాల్లో ఈ ఆలయం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకొంటున్నది. అలాగే వర్షాకాలంలో ఎత్తయిన కొండల్లో నుంచి కిందకు దూకే జలపాతం ఇటు పర్యాటకులను, అటు శ్రీవారి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

ఆదివారం ప్రత్యేకం

ఎకో సెన్సిటివ్ జోన్‌గా..



అభయారణ్యం చుట్టూ 10 కి.మీ వరకు ఎకో సెన్సిటివ్‌జోన్‌గా ఇప్పటికే ప్రకటించారు. ఈ పరిధిలో అభివృద్ధి చేసేందుకు మాస్టార్ ప్లాన్ రూపకల్పన కోసం ఇప్పటికే కేంద్రం అనుమతితో ఓ బృందం అభయారణ్యంలో పర్యటించింది. అదేవిధంగా పెంచలకోన ఆలయానికి వచ్చే భక్తులకు పర్యావరణ గురించి వివరించేలా ఎకో టూరిజం సెంటర్‌ను ఏర్పాటు చేశాము. అభయారణ్యంలో వన్యప్రాణుల కోసం నిరంతరం నీటి సరఫరా చేస్తున్నాము.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి



అభయారణ్యం మధ్యలో పెంచలకోన దేవస్థానం ఉన్నది. ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులు రోడ్డు పొడవునా ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు వేస్తున్నారు. ఈ ప్లాస్టిక్‌ని తిని అనేక వన్యప్రాణులు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. క్రూరమృగాలు ఆలయం పరిసరాల్లోకి రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేసుకోవాలి. ఈ రెండు విషయాలపై ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రవీంద్రబాబు, రాపూరు రేంజర్



...కియా బైనాటా,టెక్టోనా గ్రాండిస్ చెట్లు పెరుగుతున్నాయి. వీటితో పాటు తెగుల మందుల తోట, పూల తోటలు, సీతాకోకచిలుకల పార్క్, ఔషధ మొక్కల తోట వంటి పర్యావరణ కేంద్రాలు ఉన్నాయి.



● ప్రభుత్వాల సహకారం

శ్రీ పెనుశిల నృసింహ అభయారణ్యం అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం రూ.కోటికి తగ్గకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తున్నాయి. వీటితో ఇప్పటివరకు కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం సెంటర్ అభివృద్ధి చేశారు. పర్యాటకుల కోసం అతిథిగృహాల నిర్మాణం, పర్యావరణ విద్యాకేంద్రం, చిన్నారుల కోసం పడవ ప్రయాణానికి మినీ పాండ్, వన్యప్రాణుల కోసం నీటి తొట్టెల ఏర్పాటు, అగ్ని ప్రమాదాలు జరగకుండా 25 మంది ఫైర్‌మెన్, వన్యప్రాణాల రక్షణ కోసం 10 మంది గిరిజనులతో రెండు బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇలా వన్యప్రాణల రక్షణ చర్యల్లో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.



నేడు తొలి ఏకాదశి

చాతుర్మాసం ప్రారంభం ● వైష్ణవాలయాల్లో విశేష పూజలు



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 5 : హిందువులకు తొలి పండుగ ఏకాదశి(ఏకాశి). ఆదివారం ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ పండుగ తర్వాత నుంచే క్యాలెండర్‌లో హిందువుల పండుగలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా వైష్ణవాలయాల్లో విశేష పూజలు, అలంకరణలు జరుగుతాయి. ఏకాదశి నుంచే మహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమిస్తారు. అందువల్ల యోగులు, పీఠాధిపతులు ఎక్కడివారు అక్కడే చాతుర్మాస దీక్షలను చేపట్టి విష్ణు పూజలు చేస్తారు. ప్రజలు కూడా ఈ పండుగ సందర్భంగా ఉపవాసాలు ఉండి విశేష పూజలు చేస్తారు. ఆలయాల దర్శనం చేస్తారు. ఈ సందర్భంగా స్వామివారికి ఇష్టమైన నైవేద్యంగా పాలపిండిని తయారు చేస్తారు. ఈ పండుగను రైతులు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. వృషభన్నలకు, నాగళ్లకు, భూమాతకు పూజ చేస్తారు. అనంతరం ఏరువాక సాగిస్తారు. ఈ రోజు నుంచే వర్షరుతువు ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి. ఈ ఏడాది తొలి ఏకాదశి తిథి శనివారం సాయంత్రం 6.58 ప్రారంభమై ఆదివారం ఉదయం 9.14గంటల వరకు ఉంటుంది. అందువల్ల ఆరోతేదీనే ఈ పండుగ జరుపుకుంటారు.



వైభవంగా తపస్సుమాను ఉత్సవం

నగరంలోని శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి ఆలయంలో శనివారం రాత్రి తపస్సుమాను ఉత్సవం వైభవంగా జరిగింది. పంచపాండవులు వేషధారణలో భక్తులు కనువిందు చేశారు.

- వివరాలు 6లో..

గరుడుడిపై రంగనాథుడు



నెల్లూరు(సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శనివారం పెరియాళ్వార్ల వర్ష తిరునక్షత్రం (స్వాతి) వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి, పెరియాళ్వార్లకు తిరుమంజనం జరిగింది. భక్తుల చేసిన గోవింద నామస్మరణలు మారుమోగిపోయాయి. సాయంత్రం శ్రీవారికి గరుడ వాహనం అలంకారం, పెరియాళ్వార్లకు గజవాహన అలంకారంలో పేట ఉత్సవం జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు అందించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

రొట్టెల పండుగకు రారండహో!

నేటి నుంచి ఐదురోజుల పాటు నిర్వహణ ● విస్తృత ఏర్పాట్లు చేసిన జిల్లా అధికార యంత్రాంగం

నెల్లూరు (సాంస్కృతికం, క్రైం), జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పండుగగా, మత సామరస్యానికి ప్రతీకగా, కోరిన కోర్కెలు తీర్చే పండుగగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ ఆదివారం ప్రారంభం కానుంది. 10వ తేదీ వరకు జరిగే ఈ పండక్కి తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా భక్తజనం తరలిరానుండటంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. బారాషహీద్ దర్గా మైదానం, స్వర్ణాల చెరువు ఘాట్‌లు కళకళలాడుతున్నాయి. ఆదివారం నుండి 10వతేదీ వరకు అంగరంగ వైభవంగా జరిగే ఈ వేడుకలకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నీ సౌకర్యాలు కల్పించారు. భక్తుల ఆరోగ్యం, క్షేమంను దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రత కోసం పారిశుధ్యానికి నగర పాలక సంస్థ అగ్రతాంబూలం ఇచ్చింది. నిరంతర సేవల కోసం దాదాపు 5వేల మందికిపైగా సిబ్బందిని వినియోగిస్తున్నారు. అలాగే, 26 ప్రాంతాలలో ఎన్టీఆర్ సురక్షిత వాటర్ స్టాల్స్ ద్వారా మంచి నీరు అందిస్తున్నారు. చెరువు వద్ద షవర్లు ఏర్పాటు చేశారు. అలాగే దర్గా, పార్కింగ్ ప్రాంతాల్లో బయో టాయ్‌లెట్స్‌ను అందుబాటులో ఉంచారు.





బారాషహీద్ దర్గా ప్రాంగణంలో భక్తులు

● భక్తుల భద్రతే లక్ష్యంగా..

భక్తుల భద్రతకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో 1600 పోలీసులను వినియోగిస్తున్నారు. 24 పార్కింగ్ ప్రాంతాల్లో 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దర్గా ప్రాంతాన్ని విద్యుత్ శాఖ, నగర పాలక సంస్థలు విద్యుత్ వెలుగులు నింపారు. 12 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, 3 షిఫ్టులలో సిబ్బంది నియమించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ డైవర్షన్, మెయిన్ దర్గా, ఘాట్ ఏరియా, ఎంట్రీ-ఎగ్జిట్, క్యూలైన్‌లు, కంట్రోల్ రూమ్, అవుట్ పోస్టులను ఆయన పరిశీలించారు.

● గజ ఈతగాళ్లు సిద్ధం

స్వర్ణాల చెరువు ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ప్రమాదాల బారిన పడకుండా మత్స్యశాఖ 45 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచింది. మరో 30 మంది సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం 3 మరబోట్లతో చెరువులోని నీటి రీసైక్లింగ్ చేస్తున్నారు. అలాగే జిల్లా అగ్నిమాపక దళ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో 132 మంది సిబ్బందిని నియమించారు. అగ్నిమాపక యంత్రాలు, వాహనాలు, రెస్క్యూ బోట్లు, ఒక మిస్ట్ బుల్లెట్, 30 మందితో ప్రత్యేక బృందం అందుబాటులో ఉంటుంది.

● ఉచిత వైద్య సహాయం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుజాత ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున 2 వైద్యశిబిరాలు, ప్రైవేటు వైద్యశాలలు వైద్య శిబిరాలు సిద్ధం చేశారు. 3 అంబులెన్స్‌లు, సూపర్ స్పెషలిస్టు డాక్టర్‌ను సిద్ధం చేశారు.

● ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి దర్గా సమీపాన ఉన్న బొల్లినేని వైద్యశాల వరకు ఆరు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. వీటిల్లో రూ.10 మాత్రమే చార్జీ వసూలు చేస్తారు. ఇక నెల్లూరు నుంచి కనుమూరుకు 20 బస్సులు, ఏఎస్‌పేటకు 70 బస్సులు నడపనున్నారు. ఇక చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, కర్నూలు, కడప, విజయవాడ, ఒంగోలు, తిరుపతి ప్రాంతాలకు 40 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ చార్జీలే వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారిణి ఎస్‌కె షమీమ్ తెలిపారు. రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో అధిక ధరలు వసూలు చేస్తే 99592 25653 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

● రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం

రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం చేశామని నెల్లూరు రైల్వే సీఐ ఏ. సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే డీఎస్పీ జీ.మురళీధర్ పర్యవేక్షణలో 105 మంది సిబ్బందితో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్, నెల్లూరు సౌత్, వేదాయపాలెం, వెంకటాచలం రైల్వే స్టేషన్లలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రంగనాయకుల పేట రైల్వేగేటు, ఆత్మకూరు బస్టాండు రైల్వే బ్రిడ్జి, సౌత్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో గస్తీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

● భక్తుల సేవకు ప్రాధాన్యత ఇవ్వండి

భక్తులకు ఇబ్బందులు లేకుండా అందరూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లనుఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ నందన్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. దర్గా ప్రాంగణంలోని పోలీసు కంట్రోల్ రూమ్, స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సింధుప్రియ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



ఏర్పాట్లపై ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆరా

నకిలీ మద్యం గుట్టురట్టు



నకిలీ మద్యం, తయారీ సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారు చేసి, బెల్టుషాపులకు సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని శనివారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ కథనం మేరకు.. గుడ్లూరు గ్రంథాలయంవీధిలో నివాసం ఉంటున్న ఉప్పలపాటి వీరాంజనేయులురాజుతోపాటుగా, మరికొందరు నకిలీ మద్యం తయారు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టు షాపులకు తరలిస్తున్నారు. ఇటీవల రేపల్లె, నెల్లూరు, గోదావరి తదితర ప్రాంతాల్లో పట్టుడిన అక్రమ మద్యంపై విచారణ జరుపుతుండగా, గుడ్లూరుకి చెందిన వీరాంనేయులురాజు పేరు వెలుగులోకి వచ్చింది. ఆయన నెల్లూరులో కూరగాయల దుకాణం నడుపుతూ నకిలీ మద్యం వ్యాపారం చేస్తున్నారని అసిస్టెంట్ కమిషనర్ పేర్కొన్నారు. దీంతో అతన్ని నెల్లూరులో శనివారం అదుపులోకి తీసుకుని గుడ్లూరుకు తీసుకువచ్చి, ఆయన ఇంట్లో సోదాలు జరపగా భారీగా ఖాళీ డబ్బాలు, మద్యం సీసాలు దొరికాయన్నారు. స్థానిక గంధర్వ గిరిజనకాలనీలోని ఓ టెంట్ సామాన్ల గోదాములో కూడా స్టాక్ చేసిన ఖాళీ మద్యం సీసాలను కూడా స్వాధీనం చేసుకున్నామని వివరించారు.అంతేకాక ఆయన ఇంట్లో నకిలీ మద్యం తయారీలో కలిపే 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్‌ను, సీలింగ్ స్టిక్కర్లు, సీలింగ్ మిషన్, ఖాళీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని దయాసాగర్ తెలిపారు. కాగా కాలనీలో స్టాక్ ఉంచిన ఇంటి యజమాని వివరాలను, అతనికి రాజకీయ నాయకుల వివరాలను కూడా త్వరలో పూర్తిస్థాయిలో సేకరించి వివరాలు వెల్లడిస్తామన్నారు. కాగా ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు మధుబాబు,ఈశ్వరరావు, కందుకూరు సీఐ రేవతి, బుచ్చి, నెల్లూరు ఎక్సైజ్ సిబ్బంది, గుడ్లూరు వీఆర్వోలు చలమారెడ్డి, తిరుపాలు, వీఆర్ఏ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 5,359 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 5,359 కేసులు పరిష్కరించగా, పరిహారం కింద రూ.3,85,45,373 చెల్లించేలా నిర్ణయించారు. నెల్లూరులో 4,133, కావలిలో 191, ఉదయగిరి 93, ఆత్మకూరు 153, కోవూరు 198, గూడూరు 204, కోట 47, సూళ్లూరుపేట 98, వెంకటగిరి 122, నాయుడుపేటలో 120 కేసులను పరిష్కరించారు. నెల్లూరులోని జిల్లా కోర్టు భవనం అవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ. శ్రీనివాస్ ప్రారంభించి, ప్రసంగించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

కిలో (రూ.లలో)	
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	246

కోడిగుడ్ల ధర (100) : 570

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9,332
వెండి కిలో ధర	రూ. 1,11,100
వెండి ఒక గ్రాము	రూ.114.10

భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రార్థనలు

కావలి (టౌన్): మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం పట్టణ జెండా చెట్టు వద్దనున్న పీర్ల చావిడిలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పీర్ల చావిడి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ముజావర్లు, ఎస్‌కె రఫీ, మాజీ కౌన్సిలర్ మస్తాన్, అన్సర్, ఎస్‌కె రియాజ్, రహీం, హజరత్, కాకుటూరు రఫీ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఉదయగిరి ఎమ్మెల్యే

లింగసముద్రం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారి పాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తోపూరి రమేష్, ఆయన సతీమణి జిల్లా టెలికం అడ్వయిజరీ బోర్డు సభ్యురాలు అనూషను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించారు. గత నెలలో రమేష్ తండ్రి తోపూరి నరసింహం హత్యకు గురయ్యారు. దీంతో శనివారం రమేష్ స్వగృహానికి వచ్చిన ఎమ్మెల్యే సురేష్ వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి తన సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేముల గోపాలరావు, బొల్లినేని నాగేశ్వరరావు, జంపాల శివప్రసాద్, జంపాల శ్రీనివాసులు, కండే మాలకొండయ్య ఉన్నారు.

తూర్పుపాలెంలో సుపరిపాలన

కొండాపురం : మండలంలోని నేకునాంపేట పంచాయతీ తూర్పుపాలెం గ్రామంలో ఇంటింటికీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం శనివారం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీచేసి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సాయిపేట గ్రామంలో టీడీపీ నాయకుడు వల్లూరు వెంకటేశ్వర్లు తల్లి రాఘమ్మ ఇటీవల మరణించడంతో కుటుంబాన్ని పరామర్శించారు.

హడావుడిగా పెట్రోలుబంకు పనులు

ఎమ్మెల్యే ఆదేశాలతో నిలిపివేసిన అధికారులు

కందుకూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో పెట్రోలు బంకు ఏర్పాటు కోసం ఐవోసీ అధికారులు శనివారం హడావుడిగా పనులు ప్రారంభించారు. పట్టణ ప్రజలు, అభివృద్ధిమండలి ప్రతినిధులు ఆ పనులను అడ్డుకున్నా వారు లెక్కచేయకుండా పనులు చేస్తుండటంతో విదేశాల్లో ఉన్న ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో అధికారులు పనులు నిలిపివేయించారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నేతృత్వంలో అభివృద్ధి మండలి ప్రతినిధులు ఆందోళనలు చేయటమే గాక కలెక్టరు, రెవెన్యూమంత్రులను కలిసి సమస్యను వివరించారు. అయినా ఐవోసీ అధికారులు పనులు ప్రారంభించగా అధికారులు వద్దని చెప్పటంతో విధిలేక వెనుతిరిగారు.

393 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 514 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 393 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-96, ఆర్ఆర్-6, సీఆర్-15, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 121 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.221.84గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

వైభవంగా తపస్సుమాను ఉత్సవం



నందివాహనంపై మూలస్థానేశ్వరుడు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి ఆలయంలో శనివారం రాత్రి తపస్సుమాను ఉత్సవం వైభవంగా జరిగింది. మహాభారతంలో అర్జునుడు శివుడ్ని మెప్పించి పాశుపతాస్త్రం పొందిన ఘట్టం ఆధారంగా ఈ తపస్సుమాను ఉత్సవం నిర్వహించారు. పంచపాండవులు వేషధారణలో భక్తులు వచ్చి ఆ ప్రాంగణంలో కనువిందు చేశారు. అందులో అర్జునుడి వేషధారి తపస్సుమానును సాహసోపేతంగా ఎక్కారు. అక్కడి నుంచి ఫలాలు, పూలు, చాక్లెట్లు, నిమ్మకాయలు తపస్సుమాను వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులవైపు విసిరారు. మూలస్థానేశ్వరస్వామి సర్వాభరణాలు విశేష అలంకారంలో మేళతాళాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా విచ్చేశారు. శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయం నుంచి అర్జునిడి ఉత్సవ మూర్తిని విశేష అలంకా రంతో మంగళవాయిద్యా లతో ఊరేగింపుగా తీసుకువచ్చి మూలస్థానేశ్వరస్వామికి ఎదు రుగా ప్రతిష్ఠించారు. అనంతరం శివుడు, అర్జునులు మధ్య జరిగిన యుద్ధ సీనును అర్చకస్వాములు నిర్వహించా రు. అర్జునుడి పరాక్రమానికి మెచ్చి పాసుపసాస్త్రం ప్రసాదిం చడంతో భక్తులు బిగ్గరగా శివ పంచాక్షరి నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది.

పేదల కష్టాలు తెలిసిన సీఎం చంద్రబాబు

- కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

దగదర్తి (బిట్రగుంట) జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. దగదర్తి మండలం వెలుపోడు గ్రామ ప్రజలు కొన్నేళ్లుగా పోరాడుతున్న భూపట్టా పంపిణీ కార్యక్రమం తహసీల్దారు పీ.కృష్ణ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై 238 ఎకరాల భూమిని 238 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వ పాలనలో భూముల పంపిణీ చేశారన్నారు. ప్రభుత్వం మారిన తరువాత స్థలం చూపించక పోవడంతో తరచూ గొడవలు జరుగుతుండేవని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వెలుపోడు గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పార్టీలకు అతీతంగా పేదలకు భూములు చూపించామన్నారు. అంతే కాకుండా పొలాలకు సాగు నీరు అందించేందుకు పంట కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. దగదర్తి మండలంలోని పలుగ్రామాల్లో కూడా భూ పంపిణి కార్యక్రమం త్వరలో చేపట్టనునట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల అధ్యక్షుడు హనుమంతరావులతో కలిసి వెలుపోడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందచేశారు. తురిమెర్ల గ్రామ పంచాయతీలో రూ. 15లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ తాళ్ళూరు ప్రసాద్‌నాయుడు, స్థానిక టీడీపీ నేతలు జలదంకి శ్రీహరి నాయుడు, పులి శీనయ్య, కొండ్రెడ్డి గుణంరెడ్డి, హరికిశోర్‌రెడ్డి, పీ.మల్లికార్జునరెడ్డి, వడ్డే.వినయ్‌కుమార్, కే.శేషారెడ్డి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం : ఎమ్మెల్యే కావ్య

అల్లూరు: త్యాగానికి ప్రతీక మొహర్రం పండుగ అని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అల్లూరులోని మౌలాలీ దర్గా పీర్ల చావిడి, రాయాజి వీధిలోని పీర్లచావిడిలను ఆయన సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌తో కలిసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, అంబటి రాజేంద్ర, స్థానిక నాయకులు, దర్గా కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి



అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గంతో జిల్లా కార్యదర్శి రెహనాబేగం

కావలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అంగన్‌వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం తెలిపారు. ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కావలి పట్టణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మహాసభ శనివారం కావలి పట్టణ సీపీఎం కార్యాలయంలో కే. సుభాషిణీ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంచలయ్య, రఘురావమ్మ, విజయలత, జ్యోతిలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కావలి పట్టణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షునిగా పసుపులేటి పెంచలయ్య, అధ్యక్షురాలిగా ఏ జయంతికుమారి, ఉపాధ్యక్షులుగా రఘురావమ్మ, కే సుభాషిణి, లక్ష్మీ, ఎం ప్రభావతి, ప్రధాన కార్యదర్శిగా కే రుక్మిణీ, కార్యదర్శిగా కే విజయలత, సంయుక్త కార్యదర్శులుగా టీ. కళావతి, ఎన్ ధనలక్ష్మీ, మణి రాజేశ్వరి కోశాధికారిగా కే. జ్యోతిలక్ష్మీతో పాటు 19 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మహిళా సమస్యల పరిష్కారమే ప్రజాసత్తా లక్ష్యం

బిట్రగుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సమస్యల పరిష్కారమే ప్రజాసత్తా ప్రధాన లక్ష్యమని ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు అన్నారు. బోగోలు ఆర్సీఎం చర్చి సమీప మైదానంలో ప్రజాసత్తా మండల కమిటీ సమావేశం శనివారం జరిగింది. శోభన్‌బాబు మాట్లాడుతూ ప్రజాసత్తా ఎటువంటి రాజకీయ పార్టీలకు సంబంధించింది కాదని, కుల, మత, జాతి భేదాలు లేకుండా పార్టీలకు అతీతంగా మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మండల మహిళా అధ్యక్షులు పీ సునీత, ఉపాధ్యక్షులు వీ సుహాసిని, కార్యదర్శి ఆర్ శ్రీప్రియ, సహా యక కార్యదర్శి ఎ.జాలిని, కోశాధికారి కే.నిర్మల, కోఆర్డినేటర్ బీ.ఆదిలక్ష్మీలను ఎంపిక చేసినట్లు శోభన్‌బాబు తెలిపారు.

బాణసంచా పేలి యువకుడికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద పీరు ఊరేగింపులో బాణసంచా చేతిలో పేలి ఓ యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సినిమాహాలు వీధికి చెందిన ఫైరోజ్ అనే యువకుడు పెద్ద పీరు ఊరేగింపులో బాణసంచాను కాలుస్తూ ప్రమాదవశాత్తు చేతిలో పేలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని వైద్యం కోసం స్థానిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు.

మాలకొండలో

వినుకొండ ఎమ్మెల్యే

వలేటివారిపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ ఎమ్మెల్యేకు అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు అనంతరం శాలువా, పూలమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసింహస్వామి మహిమ కలిగిన దేవుడని తెలుసుకుని దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, కందుకూరు రూరల్ ఎస్ఐ బాలమహేంద్రనాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల ధర్నా

కావలి(టౌన్) 5 (ఆంధ్రజ్యోతి) సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం డిపో వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి బుజ్జయ్య మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి ఎటువంటి పదోన్నతి లేదని, చెల్లించాల్సిన గ్రాట్యుటీ తదితర బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మాల్యాద్రి, సత్యానందం, రాంబాబు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కావలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్‌డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ కావలి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కే సుబ్బారావు, డాక్టర్ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

కొండాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుఎర్రబల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడిపై పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఓ మైనర్ బాలికను పాఠశాల బాతురూములో బెదిరించి మైనర్ బాలుడు అత్యాచారం చేశాడన్నారు. సదరు బాలికకు ఇటీవల కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు వైద్యశాలకు తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షలు చేసి గర్భిణి అని చెప్పడంతో కొండాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణలు గ్రామంలో విచారించి మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

రక్తదానంపై అవగాహన ర్యాలీ

కావలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీక్లబ్ ఆఫ్ కావలి ఆధ్వర్యంలో శనివారం రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతూరు కృష్ణుడి బొమ్మ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ రక్తకేంద్రం వరకు సాగిన ఈ ర్యాలీలో రోటరీక్లబ్, రెడ్‌క్రాస్ సభ్యులు శ్రీలక్ష్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏ రమేష్‌రెడ్డి, కార్యదర్శి జీ రమేష్‌రెడ్డి, రోటరీ ఇంటర్నేషనల్ 3160 డిస్ట్రిక్ట్ కార్యదర్శి డాక్టర్ కే మాధవరెడ్డి, రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల గ్రామోత్సవం



వరికుంటపాడు : గ్రామోత్సవంలో మౌలాలీస్వామి పీరు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటల చెరువుపల్లిలో నిర్వహిస్తున్న మొ హర్రం వేడుకల్లో భాగంగా శనివారం పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా బారాహిమాం, మౌలాలీ స్వామి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బాణాసంచా వేడుకల నడుమ గ్రామోత్సవం చేపట్టి పీర్లచావిడికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తులు దారి పొడవునా కడవళ్లతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సాతువారిపల్లిలో ఖాశిం పీరును గ్రామోత్సవం నిర్వహించారు.

- **ఆత్మకూరు** : పట్టణంలో మొహర్రం వేడుకలు శనివారం నిర్వహించారు. ఎల్ఆర్ పల్లిలోని పీర్ల చావిడిలో పీర్లను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ముస్లీం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ప్రారంభించారు.
- **అనంతసాగరం** : మండలంలోని ముస్తాపురంలో మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం బంగారు పీరును ఊరేగించారు. ఈవేడుకను తిలకించేందుకు పలుగ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. బంగారుపీరును దర్శించుకొని కోరికలు కోరితే తీరుతాయని భక్తుల విశ్వాసం.
- **సీతారామపురం** : మండల కేంద్రంతో పాటు మండలంలోని తురకపాలెం, ఎగువపాలెం, నారాయణంపేట తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పీర్లను గ్రామాల్లోని వీధుల్లో ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సీసీ రోడ్లు, గోకులం షెడ్లకు బిల్లుల విడుదల

ఉదయగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిమెంట్‌రోడ్లు, గోకులం షెడ్‌లకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేసినట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీతారామపురం మండలానికి రూ. 58 లక్షలు, ఉదయగిరికి రూ.1.29 కోట్లు, దుత్తలూరుకు రూ.99 లక్షలు, వరికుంటపాడుకు రూ. 92 లక్షలు, వింజమూరుకు రూ.47 లక్షలు, కలిగిరికి రూ.1.50 కోట్లు, కొండాపురానికి రూ.84 లక్షలు, జలదంకికి రూ.1.10 కోట్ల పెండింగ్ బిల్లులు గుత్తేదారుల ఖాతాల్లో జమైనట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.7 లక్షల ఎంపీ నిధులు

ఉదయగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధి, షబ్బీర్ కాలనీలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.7 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న తెలిపారు. ఈసందర్భంగా ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 3న ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారన్నారు. ఇంటింటా కరపత్రాల పంపిణీలో భాగంగా షబ్బీర్ కాలనీ, దిలావర్‌భాయ్‌వీధి ప్రాంత వాసులు దీర్ఘకాలికంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వారి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎంపీ వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన రూ.7 లక్షల నిధులను ఎంపీ లాడ్స్ నుంచి విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎంపీ సూచించారన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

సంగం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పర్సన్ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సహకార సంఘం అభివృద్ధికి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరి దస్తగిరి, కార్యాలయ సిబ్బంది బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సోమశిల డ్యాం నీటిమట్టం

అనంతసాగరం జూలై 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 211 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 30.290 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం : మంత్రి ఆనం



ఆత్మకూరు వీవర్స్ కాలనీలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం ఆత్మకూరు మున్సిపాల్టీలోని వీవర్స్ కాలనీలో టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించి, నేతన్నల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

- **ఏఎస్ పేట:** మండలంలోని కుప్పురుపాడు గ్రామంలో శనివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సుపరిపానలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రా లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, ఉపాధ్యక్షులు పులిమి సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరసింహరెడ్డి, షేక్ జిలానిబాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ హజరత్తయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **వింజమూరు** : పట్టణంలోని పాత బస్టాండ్, వైశ్య బజార్ ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని గడపగడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, క్లస్టర్ యూనిట్, ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, పాల్గొన్నారు.
- **చేజర్ల:** ఎన్‌డీఏ కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతున్నామని మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని ఎన్‌వి కండ్రిక, కొలపనాయుడుపల్లి గ్రామాలలో స్థానిక టిడిపి నాయకులతో కలసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ నలబోతు శివకృష్ణ, టిడిపి నాయకులు అదినారాయణరెడ్డి, అచ్చాల నారాయణరెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.
- **అనంతసాగరం:** పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని అనంతసాగరం మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు, పడమటి కంభంపాడు, సోమశిల గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **సీతారామపురం** : మండల తెలుగు యువత నాయకుడు పసుపులేటి వికాష్ బాబు, సరికొండు రవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గుండుపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువత నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి బియ్యం వితరణ

ఉదయగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న సాయిబాబా ఆలయానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వెయ్యి కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. ఈసందర్భంగా నెల్లూరు నుంచి ప్రత్యేక వాహనంలో బియ్యాన్ని ఆలయానికి తరలించి టీడీపీ నాయకుల సమక్షంలో నిర్వాహకులకు అప్పగించారు. ఈసందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులు ఈనెల 10న గురుపౌర్ణమి సందర్భంగా తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఎంపీని కోరారు. దీంతో ఆయన వెయ్యి కేజీల బియ్యం పంపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఉప్పుటూరి పెదవెంకటయ్య, పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 96 కేసుల పరిష్కారం

ఉదయగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారులు జే అంజయ్య, ఎస్ భారతీల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 96 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు దశల వారీగా పోరాటం కొనసాగిస్తామని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోవద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రెండవరోజు శనివారం ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పదివేల పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి మేకపాటి చిన్నారెడ్డి, డిపో అధ్యక్షుడు సయ్యద్ ఫకీర్‌షా, జాయింట్ సెక్రటరీ ఏ ప్రతాప్‌రెడ్డి, ట్రెజరర్ కె వెంకటేశ్వర్లు, గ్యారేజ్ సెక్రటరీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలను పెంచి, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె నాగరాజు, బి హజరత్తయ్య, ఎం పెంచలయ్య, టి నాగరాజులు, ఎస్‌డి షఫీ, షేక్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఏఎస్ పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుంపర్లపాడు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న పోతులూరయ్య, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, మురళీకృష్ణ, ఇస్మాయిల్, అంకయ్య, సూర్యనారాయణలు బదిలీపై వెళ్లడంతో శనివారం వారిని నూతన హెచ్‌ఎం నరసింహారావు ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

డాక్టరేట్ ప్రదానం

సంగం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ నరసింహమూర్తి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి శనివారం డాక్టరేట్ పట్టా పొందారు. ఈయన ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్ పర్యవేక్షణలో సామాజిక శాస్త్ర విభాగంలో (మెడికల్ సోషియాలజీ) ప్రాణం నిలిపే ఆరోగ్య విద్య - అవయవ దానం - నెల్లూరు జిల్లా స్థితిగతులు అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. హెచ్‌ఎంను డీఈవో బాలాజీరావు, అధికారులు అభినందించారు.